
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
గురువారం 11 డిసెంబరు 2025
గరిష్ఠం : 26.5
కనిష్ఠం : 15.0
****



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	576 (271.6250)	20,467	20,467
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.68 (4.38)	456.82	333.24
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.882 (44.0354)	2,000	3,400

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250



పల్లె పోరు.. నేడు తొలి తీర్పు

- నేడే తొలివిడత పోలింగ్
- నల్లగొండ, చండూరు డివిజన్లలో ఏర్పాట్లు పూర్తి
- ఏకగ్రీవాలు మినహా 296 సర్పంచులు, 2,495 వార్డు స్థానాలకు ఎన్నికలు
- గ్రామాలకు చేరిన పోలింగ్ సామాగ్రి

నల్లగొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నల్లగొండ, చండూరు డివిజన్లలోని 14 మండలాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. రెండు డివిజన్లలో 318 పంచాయతీల్లోని సర్పంచ్ స్థానాలకు, 2,870 వార్డు స్థానాలకు 22 సర్పంచ్, 375 వార్డు స్థానాలు ఏకగ్రీవ మయ్యాయి. దీంతో గురువారం జరిగే మొదటివిడత పోలింగ్‌లో 296 సర్పంచ్, 2495 వార్డు మెంబర్ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికల్లో మొత్తం 5,600 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఎన్నికల విధుల నిర్వహణకు 7వేల మంది సిబ్బందిని నియమించారు. గ్రామాలకు చేరిన పోలింగ్ సామాగ్రి మొదటి విడత పంచాయతీ ఎన్నికల కోసం ప్రతీ మండలానికి ఒక డీఆర్‌సీని ఏర్పాటు చేసి ఎన్నికల పోలింగ్ సామాగ్రిని అన్నిగ్రామాలకు పంపిణీ చేశారు. బుధవారమే సామాగ్రితో పాటు సిబ్బంది గ్రామాలకు చేరుకున్నారు. అదేవిధంగా ఒక్కో మండలానికి రూట్ అధికారులతో పాటు ఇద్దరు లేదా ముగ్గురు జోనల్ అధికారులను నియమించారు. ఎప్పటికప్పుడు ఎన్నికల సమాచారం తెలుసుకోవడం కోసం కలెక్టరేట్‌లో కాల్ సెంటర్‌ను ఏర్పాటుచేశారు. ఎన్నికల సంఘం ఆమోదించిన 14 కార్డులలో ఏదో ఒకటి చూపించి ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. పోలింగ్ ముగిసిన వెంటనే కౌంటింగ్ పూర్తి చేయడంతో పాటు ఉపసర్పంచ్ ఎన్నికను కూడా పూర్తి చేయనున్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి పలు మండలాల్లో విస్తృతంగా పర్యటించి ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

నల్లగొండ, చండూరు డివిజన్లలోని పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓటుహక్కు వినియోగించుకోవాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. ఓటర్లు నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 163(బీఎన్ఎస్ఎస్) యాక్టు అమలులో ఉంటుంది. పోలింగ్ కేంద్రాల ప్రాంతంలో 100 మీటర్ల వరకు ఎవరినీ రానివ్వకుండా చూడనున్నారు. ఓటు వేసే వారు సెల్‌ఫోన్లు, ఇంక్ బాటిల్స్‌ను, ఇతర హానికరవస్తువులను తీసుకరాకుండా పోలీసులు తనిఖీ చేయనున్నారు. పోలింగ్ రోజు ఏదైన సంఘటన జరిగితే క్షణాల్లో రూట్ మొబల్ టీం వచ్చేలా ఏర్పాట్లుచేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద నిఘా పెంచారు. ఎన్నికల అనంతరం విజేతలు విజయోత్సవాలకు, ర్యాలీలకు అనుమతి లేదు.


నల్లగొండ మండలం రాములబండలో పోలింగ్ కేంద్రం ఏర్పాటులో సిబ్బంది

మండలం	గ్రామాలు	వార్డులు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు	మొత్తం
చిట్యాల	18	180	17,760	17975	0	35,735
కనగల్లు	31	262	18313	18579	0	36892
కట్టంగూరు	22	206	18,565	18,797	0	37362
కేతేపల్లి	16	160	15136	15947	1	31084
నకిరేకల్	17	160	13283	13558	2	26843
నల్లగొండ	31	270	19166	20063	0	39229
నార్కట్‌పల్లి	29	262	21508	22263	1	43772
శాలిగౌరారం	24	230	19937	20448	3	40388
తిప్పర్తి	26	216	13468	14222	0	27690
చండూరు	19	166	12137	12186	0	24323
గట్టుప్పల్	7	68	7832	7785	0	15617
మర్రిగూడ	18	170	15146	15639	0	30785
మునుగోడు	28	244	18990	19048	0	38038
నాంపల్లి	32	276	17886	18524	1	36411

ఒకరికంటే ఒకరు

- ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు తీవ్రయత్నాలు
- కనిష్ఠంగా రూ.1000 గరిష్ఠం రూ.3 వేలు పంపిణీ
- పోటాపోటీగా అధికార, ప్రతిపక్ష, రెబల్స్ అభ్యర్థుల పంపిణీ

నల్లగొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొదటిదశ పోలింగ్ జరిగే గ్రామపంచాయతీల్లో అభ్యర్థులు ఓటర్లను ఆకర్షించేందుకు పోటీపడుతున్నారు. తాయిలాల పంపిణీలో ఒకరిని మించి ఒకరు ముందుంటున్నారు. దీంతో ఓటర్లకు పంచేందుకు నోట్ల కట్టలు కరిగిపోతున్నాయి. అధికార కాంగ్రెస్ అభ్యర్థులతో పాటు, ప్రతిపక్ష బీఆర్ఎస్ మద్దతుదారులు, స్వతంత్రులు, కాంగ్రెస్ రెబల్స్ సైతం పోటాపోటీగా నగదు పంపిణీ చేశారు. ఇప్పటికే ఒక్కో ఇంటికి నాలుగు దఫాలుగా మద్యం పంపిణీ చేయగా, బుధవారం రాత్రి మరోసారి మద్యం సీసాలతో పాటు, నగదు కవర్లు అందజేశారు. కాంగ్రెస్ నేతలు అన్ని పంచాయతీలను గెలవాలనే సంకల్పంతో తమవంతుగా అందించిన ఆర్థిక సహాయంతో పాటు అభ్యర్థులు కొంత కలుపుకొని భారీగా పంపకాలు చేశారు. కాంగ్రెస్ నుంచి బరిలో ఉన్న అభ్యర్థులు ఓటర్లకు ఒక్కో ఓటుకు కనీసం రూ.1000 నుంచి మొదలుపెట్టి గరిష్ఠంగా కొన్ని గ్రామాల్లో రూ.3వేల వరకు నగదు అందజేశారు. అదేవిధంగా చివరిరోజు ఇంటికి కిలో చొప్పున మాంసం, హాఫ్ బాటిల్ విస్కీ అందజేశారు. వీటితో పాటుగా కొన్నిచోట్ల మహిళా సంఘాలు, కులసంఘాల ద్వారా ఒప్పందాలు చేసుకుని ఓటర్లకు నగదు అందజేశారు. నల్లగొండ, మునుగోడు నియోజకవర్గాల్లో ఖర్చు తారస్థాయికి చేరగా, సూర్యాపేట, తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాల్లోనూ గతానికి భిన్నంగా నగదు పంపిణీ జరిగినట్లు సమాచారం. అదేవిధంగా ఆలేరు నియోజకవర్గంలోనూ నగదు, మద్యం పంపిణీ కొనసాగిందని, కొన్నిగ్రామాల్లో అభ్యర్థుల గుణగణాల కంటే తాయిలాలే విజేతను నిర్ణయించే పరిస్థితి నెలకొందని చెబుతున్నారు.

హోం ఓటింగ్ లేనట్టే

- అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగులు, 85 ఏళ్లుపైబడిన వృద్ధులకు హోం ఓటింగ్
- ఈ పంచాయతీ ఎన్నికల్లో అవకాశం లేదు
- ఒంటి గంట వరకే పోలింగ్ సమయం

విచిత్ర అవగాహనలు

వివరాలు 6లో

ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి


సిబ్బంది ర్యాండమైజేషన్ నిర్వహిస్తున్న అధికారులు

నల్లగొండ(కలెక్టరేట్),డిసెంబరు 10,(ఆంధ్రజ్యోతి): మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న దేవరకొండ డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లో విధులు నిర్వహించే సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తయింది. గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకురాలు కొర్రా లక్ష్మీ సమక్షంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ చాంబర్‌లో ర్యాండమైజేషన్ నిర్వహించారు. చందంపేట, చింతపల్లి, దేవరకొండ, గుడిపల్లి, గుండ్లపల్లి, గుర్రంపోడు, కొండమల్లేపల్లి, నేరేడుగొమ్ము, మండలాల్లోని 2206 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. 2647 మంది పీవోలు, 2959 మంది వోపీవోలను విధులకు నియమించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జెడ్పీ సీఈవో శ్రీనివాసరావు, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, డీఈవో బిక్షపతి, ఆర్డీవో వై. అశోక్‌రెడ్డి కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్, ఈడీ ఎం. దుర్గారావు, ఎన్ఐసీ అధికారి ప్రేమ్ పాల్గొన్నారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎస్పీ శరత్ చంద్రపవార్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్ చంద్రపవార్

నల్లగొండ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు 2వేల మందితో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. నల్లగొండ రూరల్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రం అప్పాజీపేట గ్రామంలో నిర్వహించిన కవాతుతో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మొదటి విడతలో భాగంగా 318గ్రామపంచాయతీల్లో 466 పోలింగ్ కేంద్రాలు, 2870 పోలింగ్ స్టేషన్‌లలో ఎన్నికలు జరగనున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి మండలానికీ సుమారు 2వేల మంది పోలీస్ సిబ్బందితో రూట్ మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించి ఎన్నికలపై ప్రజలకు భరోసా కల్పించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, వాటర్ బాటిళ్లు, ఇంకు బాటిల్లు, పెన్నులు, అగ్నికి సంబంధించిన వస్తువులను అనుమతించబోరని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, నల్లగొండ రూరల్ సీఐ రాఘవరావు, నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదబాబు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

కట్టంగూరు, డిసెంబరు 10, (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలో గురువారం జరగనున్న మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ శరత్ చంద్రపవార్ తెలిపారు. మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో అక్రమాలు జరగకుండా ప్రతి పోలీస్ సమన్వయంతో పనిచేయాలన్నారు.ఆయన వెంట డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ మునుగోటి రవీందర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ పారదర్శకంగా నిర్వహించాలి

నల్లగొండ రూరల్/నార్కట్‌పల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. స్థానిక ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఇంద్రారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ సందర్శించారు. నల్లగొండ మండలంలోని 29 గ్రామాల్లో నిర్వహించే ఎన్నిక సిబ్బందికి నిర్వహణ సామగ్రిని పరిశీలించి, వారి పలు సుచనలు చేశారు. ఈ కేంద్రంలో మండల ఎన్నికల నిర్వహణ అధికారి ఎంపీడీఓ యాకూబ్ నాయక్, తాసీల్దార్ కే.పరుశరాం, ఎంఈవో అరుంధతి ఇతర సిబ్బంది ఉన్నారు. నల్లగొండ మండలంలోని 29 గ్రామాలకు 1114 మంది సిబ్బందితో నిర్వహించనున్నారు. ఇందుకు ప్రొసిడింగ్ అఫీసర్లు 330, ఇతర ప్రొసీడింగ్ ఆఫీసర్లు 530, స్టేజ్ వన్ అఫీసర్లు 34, రూట్ ఆఫీసర్లు, జోనల్ ఆఫీసర్లు 20, పోలీస్ సిబ్బంది 200తో డిఆర్‌సీ కేంద్రనుండి తమ సామగి తీసుకుని ప్రత్యేక బస్సుల్లో వెళ్లారు.

నార్కట్‌పల్లి, డిసెంబరు 10, (ఆంధ్రజ్యోతి) నార్కట్‌పల్లిలోని డీఆర్‌సీ కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా ఎన్నికల పరిశీలకురాలు కొర్ర లక్ష్మీతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో నల్లగొండ ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డి, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, డీపీవో వెంకయ్య, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో ఉమేశ్‌చారి, ఎంపీవో సుధాకర్ పాల్గొన్నారు.


నల్లగొండలో డీఆర్‌సీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

150 మందితో బందోబస్తు: గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా నార్కట్‌పల్లి మండలంలో 150 మందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్ తెలిపారు. డీఎస్పీ పర్యవేక్షణలో 3 గురు సీఐలు, 9 మంది సీఐలు, మిగతా 145 మంది మెన్, ఉమెన్ పీసీలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

గట్టుప్పల: ఎలాంటి ఇబ్బందులకు అవకాశం ఇవ్వకుండా మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె గట్టుప్పల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్నికల పంపిణీ స్వీకరణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆమె వెంట జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జెడ్పీసీఈవో శ్రీనివాసరావు, డీఆర్‌డివో శేఖర్ రెడ్డి, చండూరు ఆర్‌డీవో శ్రీదేవి, ఎంపీడీవో వసంతలక్ష్మీ, తహసీల్దార్ రాములు ఉన్నారు.

మునుగోడు : గ్రామపంచాయతీల్లో జరిగే తొలిదశ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మునుగోడులో ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీ ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జడ్పీసీఈవో శ్రీనివాస్‌రావు, డీఆర్డీవో శేఖర్ రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, ఎంపీడీవో యుగంధర్ రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ నరేష్, మండల పరిషత్ పర్యవేక్షకుడు విజయ్‌భాస్కర్, ఎంపీవో మధు ఉన్నారు.

ఊపందుకున్న ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులు

నల్లగొండ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పేద విద్యార్థులు ఉపకార వేతనాలు పొందేందుకుగాను కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. మండలాల వారీగా 13,914 మంది విద్యార్థులకు ఉపకారవేతనాలు అందించాల్సి ఉండగా, వారం వరకు కేవలం6శాతం మాత్రమే ఉన్న వేతనాల దరఖాస్తులు,ఆరు రోజులో 28 శాతానికి పెరిగాయి. ఇందుకు కలెక్టర్ వారంలో రెండుసార్లు ఉపకార వేతనాలపై విద్యాశాఖ అధికారులు, సంక్షేమ అధికారులతో ప్రత్యేక సమీక్షాసమావేశాలు నిర్వహించి దరఖాస్తుల అప్‌లోడ్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఇప్పటివరకు 13,914 మంది విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకున్నారని,తక్కినవారితో దరఖాస్తులను సమర్పించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఒక ప్రకటనలో ఆదేశించారు. ఇందుకు విద్యాశాఖ అధికారులతో పాటు, సంక్షేమ శాఖ అధికారులు, బ్యాంక్ అధికారులు సహకరించాలని, తహసీల్దార్లు విద్యార్థులకు అవసరమైన ధ్రువపత్రాలను జారీ చేయాలన్నారు.

మానవ హక్కులు అందరికీ సమానమే

- జిల్లా జైలు పర్యవేక్షణ అధికారి ప్రమోద్ కుమార్

నల్లగొండ క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులు ప్రతీ ఒక్కరికి సమానంగా వర్తిస్తాయని ఖైదీలు కూడా సమాజంలో భాగమేనని జిల్లా జైలు పర్యవేక్షణాధికారి గౌరు ప్రమోద్ కుమార్ అన్నారు. జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కారాగారంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలకు న్యాయ సహాయం, గౌరవం, రక్షణ, పునరావాసం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు బీమార్జు న్‌రెడ్డి, లెనిన్ బాబు, జైలర్ బాలకృష్ణ, డిప్యూటీ జైలర్ వెంపల్ల వెంకట్ రెడ్డి, చింత వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా జైలు వద్ద పర్యవేక్షణ అధికారి ప్రమోద్‌కుమార్

చట్టాలు పోలీసులకు సైతం వర్తించాలి

సూర్యాపేట టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చట్టాలు సామాన్యులకే కాదని పోలీసులకు సైతం వర్తిస్తాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో జరుగుతున్న లాకప్‌డెత్‌లకు ముగింపు పలకాలన్నారు. లాకప్‌డెత్‌లకు కారణమవుతున్న పోలీసులు, అధికారులు ఏ కులం,వర్గం వారైనా కఠినంగా వ్యవహరించాలన్నారు. కోదాడ మండలానికి చెందిన కర్ల రాజేష్ పోలీసుల చేతుల్లో చిత్రహింసలకు గురై లాకప్‌డెత్‌కు గురయ్యాడన్నారు. నేటికీ అందుకు సంబంధించిన పోలీసులపై ఎలాంటి కేసులు నమోదు చేయడం లేదని, కనీసం చర్యలు తీసుకోలేదన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణమాదిగ

నయీంతో కలిసి దోచుకున్న కిషోర్

డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్

నల్లగొండ, డిసెంబరు 10,(ఆంధ్రజ్యోతి): తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ గ్యాంగ్‌స్టర్ నయీంతో కలిసి హైదరాబాద్‌లో వందల కోట్లు దోచుకున్నారని డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాస్ నేత ఆరోపించారు. జిల్లాకేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కిషోర్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అప్పటి మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డితో కలిసి ఇసుక దోపిడీకి పాల్పడి కోట్లాది రూపాయలు గడించారని, నయీంతో అంటకాగి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. రెండేళ్లలోనే రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డిని, ఉమ్మడి నల్లగొండ జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని విమర్శించే అర్హత కిషోర్‌కు లేదన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ ప్రతీఒక్కరిని ఆదుకుంటారని, విద్య, వైద్యం కోసం సహాయ సహకారాలు అందిస్తూనే అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుంటారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రోజుకు 18 గంటలు పనిచేస్తున్నారని, అలాంటి వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీమంత్రి కేటీఆర్‌ల నాయకత్వంలో బీఆర్ఎస్ నేతలు దండుపాళ్యం ముఠాగా ఏర్పడి తెలంగాణను దోచుకున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నల్లగొండ జిల్లాకు ఏ ఒక్క ప్రాజెక్టు కూడా తీసుకురాలేదన్నారు. అలాంటి పార్టీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే ప్రజలు సహించరన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రగతి భవన్‌లో రూ.995కోట్ల ప్రజాధనాన్ని భోజనం ఖర్చులకే ఉపయోగించుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ప్రయోజనం జరగలేదన్నారు. వారి కుటుంబ సభ్యులకు మాత్రమే ఉద్యోగాలు వచ్చాయి తప్ప ప్రజలకు ఎలాంటి ఉపయోగం జరగలేదన్నారు. ఇటీవల నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణకు రూ.5లక్షల75వేల కోట్లు పెట్టుబడులు రానున్నాయని, దీనివల్ల పరిశ్రమలు రావడంతో పాటు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా చైర్మన్ బోడ స్వామి, నాయకులు తాడూరి శ్రీను, శరత్, సచిన్ పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్

జెండా పట్టలే.. జై కొట్టలే

● అయినా అభ్యర్థిత్వం ఖరారు ● అసంతృప్తితో బరిలో పాతకాపులు



గ్రామపంచాయతీ ఎన్నికల సిత్రాలు చిత్రవిచిత్రంగా సాగుతున్నాయి. పార్టీలకతీతంగా జరగాలనో, ఎన్నికల నిబంధనలు పాటించాలనో, మరెందుకో గానీ ఏనాడూ జెండా పట్టని కొందరికి చివరి నిమిషంలో అభ్యర్థిత్వాలు ఖరారయ్యాయి. పార్టీకి, అగ్రనాయకులకు జై కొట్టని వారు జట్టులో కలిసిపోయారు. ఏళ్ల తరబడి ఎన్నికల కోసం ఎదురు చూసిన నాయకుల్లో కొందరికి భంగపాటు తప్పలేదు.

● మిర్యాలగూడ టౌన్, ఆంధ్రజ్యోతి

సర్పంచ్ అభ్యర్థిత్వం తమకే దక్కుతుందని భావించి భంగపడిన వారు ఇండిపెండెంట్‌గా బరిలో నిలుస్తున్నారు. దీంతో గ్రామపంచాయతీల్లో పంచాయితీలు జరుగుతున్నాయి. సుదీర్ఘకాలంగా పార్టీకి, ప్రజలకు సేవలందించిన వారిని కాదని, కొత్తగా, కొంగొత్తగా పార్టీలో చేరిన వారిని ఆయా రాజకీయపార్టీలు అక్కున చేర్చుకుంటుండడంతో పార్టీ కార్యకర్తలు పెదవి విరుస్తున్నారు. ఇక సదరు అసంతృప్తి నాయకుడు బరిలో నిలిచి అసలు, సిసలు అభ్యర్థికి సవాల్ విసరడం కొత్త ఇబ్బందులు తెచ్చి పెడుతోందని పార్టీ పెద్దలు తల పట్టుకుంటున్నారు.

అసలు ఒకరు.. కొసరు ఒకరు

రెండో విడత ఎన్నికలు జరగనున్న గ్రామపంచాయతీల పరిస్థితిని గమనిస్తే.. పలు చోట్ల ఇద్దరేసి అభ్యర్థులు(ఒకే పార్టీకి చెందిన) బరిలో ఉన్నారు. ఇద్దరూ పార్టీ అభ్యర్థిత్వం కోసం ఎదురు చూసినా ఒకరికి షేక్‌హ్యాండ్, మరొకరికి హ్యాండి వ్వడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని గ్రామాల్లో చర్చ జరుగుతోంది. అయితే అవకాశాలు, బలాబలాలు సమానం ఉన్నాయని, పైసిచ్చిన వారిదే పై చేయిగా ఉంటుందని నిక్కచ్చిగా చెబుతుండటం ఆశ్చర్యాన్ని కలిగించే విషయం.

సామాజిక సమీకరణల కారణంతోనేనా..?

పార్టీలకతీతంగా నిర్వహించాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలపై సామాజిక సమీకరణలు ప్రభావం చూపుతున్నాయి. గెలుపోటముల సంగతి అటుంచితే.. అభ్యర్థుల ఖరారులో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. కొన్ని గ్రామాల్లో ఆర్థిక కోణం నుంచి అభ్యర్థులను ఖరారు చేసిన నేతలు, మరి కొన్ని గ్రామాల్లో సామాజిక సమీకరణలు చూస్తున్నారు.

ఆ గట్టునుండాలా.. ఈ గట్టునుండాలా..?

అధికారం కోల్పోయి అవకాశం కోసం చూస్తున్న పార్టీలు అసంతృప్తులను అక్కున చేర్చుకుంటున్నాయి. ఈ తరుణంలో గ్రామ ఓటర్లు ఆ గట్టునుండాలా.. ఈ గట్టుకు చేరాలా అని అయోమయానికి గురవుతున్నారు. మొన్నటి వరకూ ఆదే పార్టీ జెండా వేసుకుని అతని వెంట తిరిగిన అనుచరులు, అమాంతం ప్రతిపక్ష పార్టీతో అంటకాగడం తమ వల్ల కాదంటుండగా, అందరినీ సమన్వయ పరచడంలో తలమునకలవుతున్నారు పార్టీ పెద్దలు.

విచిత్ర అవగాహనలు

● కొన్నిచోట్ల ప్రత్యర్థులు, మరికొన్ని చోట్ల స్నేహ హస్తం



డిండి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో అధికార, విపక్ష పార్టీల మధ్య కుదిరిన అవగాహన విచిత్రంగా ఉంది. కొన్ని గ్రామాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అవగాహనకు రాగా, మరికొన్ని గ్రామాల్లో ఇరు పార్టీలకు చెందిన అభ్యర్థులు ప్రత్యర్థులుగా బరిలో ఉన్నారు. మండలంలోని వావిల్‌కోల్ కాంగ్రెస్ పార్టీ తిరుగుబాటు అభ్యర్థికి బీఆర్ఎస్ నాయకులు మద్దతు పలికారు. ఇదే తరహాలో బొలనపల్లి కాంగ్రెస్ పార్టీ తిరుగుబాటు సర్పంచ్ అభ్యర్థికి బీఆర్ఎస్ నాయకులు మద్దతుగా ఉన్నారు. మండలంలో విలక్షణ, విచిత్రమైన అవగాహన ఉంది. గ్రామపంచాయతీ ఎన్నికల్లో కలిసి పోటీ చేసేందుకు కాంగ్రెస్, సీపీఐ అవగాహన కుదుర్చుకున్నాయి. మండలంలో 39 పంచాయతీలు ఉండగా పొత్తులో భాగంగా సీపీఐ గోనకోలు, ఖానాపూర్, కందుకూరు, రామాంతపూర్ గ్రామాల్లో పోటీ చేస్తుండగా, ఖానాపూర్, గోనకోలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థులు బరిలో దిగారు. దీంతో గోనకోలు పంచాయతీ నుంచి నామినేషన్ దాఖలు చేసిన సీపీఐ అభ్యర్థి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. మండలంలోని కందుకూరు, వావిల్‌కోల్, వీరబోయినపల్లి, డిండి గ్రామాల్లో బీజేపీ అభ్యర్థులను నిలిపింది. కామేపల్లి, రామాంతపూర్, దేవత్‌పల్లి తండాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించారు. ఎర్రగుంటపల్లి పంచాయతీలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య అవగాహన కుదిరింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి బీజేపీ మద్దతు ప్రకటించింది. డిండిలో సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన ఇద్దరు బీజేపీ అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు.

పల్లె పాలన.. పాఠశాలలో బోధన

● ఎన్నికల నేపథ్యంలో గ్రామపంచాయతీ పాలనపై విద్యార్థుల ఆసక్తి



భువనగిరి రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైన సర్పంచ్, వార్డు సభ్యులు, ఉప సర్పంచ్ బాధ్యతలు ఏమిటనేది పెద్దలకు తెలుసు. విద్యార్థులకు ప్రాథమిక దశలోనే వారికి కూడా తెలవాలనే తరగతి గదిలో పల్లె పాలన తీసుకొచ్చినట్టుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 11, 14, 17 తేదీల్లో పంచాయతీ పోరుకు రంగం సిద్ధమైంది. ప్రతిరోజూ బడికి వెళ్తున్న పిల్లలు గ్రామాల్లో ఎన్నికల కోలాహలం చూసి.. 6వ తరగతి సాంఘిక శాస్త్రంలో గ్రామపంచాయతీల పాఠం ఉందని పేజీలు తిరగేస్తున్నారు. విద్యార్థుల కోరిక మేరకు ఉపాధ్యాయులు బోధిస్తుండడం విశేషం.

విద్యార్థులకు అవగాహన కోసం..

ప్రజాస్వామ్యం, గ్రామపంచాయతీ విధులు, సిబ్బంది కర్తవ్యం, ఓటు హక్కు తదితర అంశాలపై ఈ పాఠం బాల్యంలోనే అవగాహన కలిగిస్తుంది. గ్రామసభ, ఓటర్ల జాబితా, వార్డులు, రిజర్వేషన్లు ఎన్నికల నిర్వహణతో పాటు పాలకవర్గం, పంచాయతీ కార్యదర్శుల విధులు తదితర అంశాల వారీగా పొందుపరిచారు. ఎన్నికల పాఠం గురించి చర్చిస్తుండడంతో ఆసక్తి గల పాఠమైంది. పాలకవర్గాలకు ఉండే అధికారాల గురించి విద్యార్థులు తెలుసుకుంటున్నారు.

ఈ సారి దగ్గరుండి చూస్తా



మా ప్రాంతంలో ఈ నెల 11న పంచాయతీ ఎన్నికలు జరుగుతాయి. తరగతి గదిలో పాఠం విన్న ఎన్నికలు జరిగే రోజు దగ్గరుండి చూస్తున్నా. ఇప్పటికే కొందరు మా ఇంటికి వచ్చి ఓట్లు అడిగారు. ఎవరికి ఓటు వేస్తారని అమ్మానాన్నను అడిగితే బయటకు చెప్పకూడని విషయమని చెప్పారు.

● వి. అనీష్, 6వ తరగతి విద్యార్థి

బ్యాలెట్ గురించి తెలుసుకున్నా



సాధారణ ఎన్నికలప్పుడు తల్లిదండ్రులతో కలిసి సమీపంలో ఉన్న పోలింగ్ కేంద్రానికి వెళ్లా అక్కడ ఒక మిషన్ ఈవీఎంను చూశా. ఇప్పుడు పుస్తకంలో మాదిరి బ్యాలెట్ ముద్రించి ఉండడం చూసి అడిగి తెలుసుకున్నా. స్వస్తిక్ ముద్ర గురించి కూడా ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు.

● కె. సారిక, 6వ తరగతి

హోం ఓటింగ్ లేనట్టే

● అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగులు, 85 ఏళ్లుపైబడిన వృద్ధులకు హోం ఓటింగ్ ● పంచాయతీ ఎన్నికల్లో అవకాశం లేదు

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగం అత్యంత ప్రధానమైనది. ఓటు ద్వారా ఐదేళ్లు పాలించే పాలకులను ఎన్నుకుంటారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నది ఎన్నికల సంఘం లక్ష్యం. అందుకోసం ఎన్నికల కమిషన్ ఎప్పటికప్పుడు ఏర్పాట్లు చేస్తుంది. ఓటు హక్కుపై అవగాహన కల్పించడం, పోలింగ్ కేంద్రాల ఆవరణలో వీల్‌చైర్లు అందుబాటులో ఉంచడం, వీల్‌చైర్‌లో దివ్యాంగులు, అనారోగ్యం, వృద్ధాప్యంతో నడవలేని వారిని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లడానికి సిబ్బందిని ఏర్పాటు చేస్తుంది.



● ఆంధ్రజ్యోతి, మోత్కూరు

దివ్యాంగులు, వృద్ధులు, అనారోగ్యంతో నడవలేక పోలింగ్ కేంద్రాల వద్దకు కూడా వెళ్లలేని వారి కోసం ఎన్నికల కమిషన్ గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ప్రత్యేక ఏర్పాటు చేసింది. దివ్యాంగులు, అనారోగ్య బాధితులు, 85ఏళ్ల పైబడిన వృద్ధులు ముందుగా దరఖాస్తు తీసుకుని, ఎన్నికల అధికారులను వారి ఇంటి వద్దకు పంపి బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించారు. దాంతో కొంత ఓటింగ్ శాతం పెరిగిందంటారు. ఇప్పుడు జరుగుతున్న పంచాయతీ పోరులో మాత్రం ఆ అవకాశం లేకుండాపోయింది. వృద్ధులు, దివ్యాంగులు, నడవలేని స్థితిలో ఉన్న ఓటర్ల గతంలో లాగా ఇంటి వద్ద ఓటు వేసే అవకాశం లేకపోవడంతో తాము పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేం కదా తాము ఓటు వేయకుండా ఉండాల్సిందేనా అని మదన పడుతున్నారు.

పోలింగ్ సమయం కూడా తక్కువే

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ నెల 11, 14, 17వ తేదీల్లో మూడు విడతలుగా పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయి. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలప్పుడు పోలింగ్ ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుంది. అప్పుడు సమయం ఎక్కువగా ఉంటున్నందున నడవలేని వారిలో కొందరైనా మధ్యమధ్య విశ్రాంతి తీసుకుంటూ మెల్లగా వెళ్లి ఓటు వేసే అవకాశముండేది. పంచాయతీ ఎన్నికల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకే పోలింగ్ జరుగుతున్నందున సమయం తక్కువ కాబట్టి నడవలేని వారు ఓటు వేసే అవకాశం తక్కువంటున్నారు. అభ్యర్థులు ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించకూడదు. వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో నడవలేని వారు గ్రామానికి పదిఇరవై మంది అయినా ఉంటారు. వారు గతంలో తమ ఇంటి వద్దకు వచ్చి ఓటు వేయించుకున్న అధికారులు ఇప్పుడెందుకు రారని ప్రశ్నిస్తున్నారు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో




వృద్ధులు, దివ్యాంగులు, ఇతర నడవలేని స్థితిలో ఉన్నవారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఎన్నికల సంఘం కొంత కాలంగా హోం ఓటిం గ్ విధానాన్ని అమలు చేస్తున్నది. రెండేళ్ల క్రితం జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఓటరు జాబితా ప్రకారం 85ఏళ్ల పైబడిన వృద్ధులు, 40శాతం పైగా వైకల్యం కలిగిన దివ్యాంగులు, పక్షవాతం లాంటి అనారోగ్య సమస్యతో నడువలేని వారికి ఇంటి వద్దనే ఓటు వేసే వెసులుబాటు కల్పించింది. ఇంటి వద్ద ఓటు వేయడం కోసం ప్రత్యేకంగా రూపొందించిన 12-డీ ఫామ్‌ను వివరాలతో పూర్తిచేసి రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకుంటే వారు పరిశీలించి అర్హులైన వారికి ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం కల్పించారు. ఇప్పుడా అవకాశం లేక పోవడంతో కొందరు ఓటింగ్‌కు దూరమవు తారని భావిస్తున్నారు. ఈ విషయమై స్థానిక ఎన్నికల అధికారులను అడిగితే ఇప్పుడు అలాంటి అవకాశం లేదని, ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించడం తప్ప తమచేతుల్లో ఏముందంటున్నారు.

మఠంపల్లి మండలంలో మృతులకూ.. ఓటుహక్కు

● తప్పులతడకగా ఓటరు జాబితా

మఠంపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో ఓటర్ల జాబితా తప్పుల తడకగా తయారైంది. మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో ఏడాది క్రితం మృతిచెందిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించలేదు. గుర్రంబోడుతండా, పెదవీడు, రామచంద్రాపురంతండా, భీల్యానాయక్ తండా, చెన్నాయిపాలెం, చౌటపల్లి, మఠంపల్లి, రఘునాథపాలెం, తుమ్మలతండా, మంచ్యాతండా, కాల్వపల్లితండా, దొనబండతండా, యాతవాకిళ్ల తదితర గ్రామాల్లో ఏడాది క్రితం మృతిచెందిన వారి పేర్లు కూడా ఓటరు జాబితాలో ఉన్నాయి. ఈ ఏడాది జూలై ఒకటో తేదీ నాటికి జాబితా క్రమబద్ధీకరించినట్లు అధికారులు పేర్కొంటున్నా ఎలాంటి మార్పులు కనిపించడం లేదు. ఎన్నికలకు ముందు రెవెన్యూ, బూత్ లెవల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినందునే ఈ సమస్య తలెత్తింది. మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లోని ఓటరు జాబితాల్లో మొత్తం 300కు పైగా మృతి చెందిన వారి పేర్లు ఉండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి మృతుల పేర్లను తొలగించి దొంగ ఓట్లు వేయకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ మంగను వివరణ కోరగా బూత్ లెవల్ అధికారులకు ఇటీవల ఆదేశాలు జారీ చేశామన్నారు. మృతుల పేర్లను తమ దృష్టికి వస్తే తొలగిస్తానన్నారు. దొంగ ఓట్లు వేయకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.



మఠంపల్లి మండలంలో ఓటరు జాబితాలో చనిపోయిన వారి పేర్లు

ప్రతి ఓటూ కీలకమే

● స్వల్ప ఓట్ల తేడాతో ఫలితాలు తారుమారు

సంస్థాన్ నారాయణపురం, వలిగొండ, డిండి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత కీలకంగా ఉంటాయి. పార్టీల పరంగా కాకుండా వ్యక్తుల పరంగా కొంత ప్రాధాన్యం ఇస్తారు. ప్రతి ఓటూ విలువైనదిగా భావిస్తారు. ఏ ఒక్క ఓటు వదులుకున్న జయపజయాలు తారుమారవుతాయి యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం గ్రామపంచాయతీకి 2019 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఉప్పల లింగస్వామి ఒక్క ఓటు తేడాతో ఓటమిపాలయ్యారు. కాంగ్రెస్ తరుపున పోటీ చేసిన ఉప్పల లింగస్వామికి 1828 ఓట్లు పోలయ్యాయి. బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన శికిలంమెట్ల శ్రీహరికి 1829 ఓట్లు పోలయ్యాయి. ఉత్కంఠంగా జరిగిన కౌంటింగ్‌లో ఒక్క ఓటు తేడాతో ఉప్పల లింగస్వామి విజయాన్ని చేజార్చుకోగా, శిఖిలమెట్ల శ్రీహరి గెలుపొందారు.

● యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని గోపరాజుపల్లికి చెందిన సర్పంచ్ అభ్యర్థి కీసర్ల ఉపేంద్ర 14ఓట్లతో గెలుపొందారు. వార్డు సభ్యులుగా టేకులసోమారానికి చెందిన పడమటి లత, మందడి వసంత ఒక్క ఓటు తేడాతో ఓటమి పాలయ్యారు.

● నల్లగొండ జిల్లా డిండి మండలంలోని ప్రతాప్‌నగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జర్పుల లక్ష్మీ బీఆర్ఎస్ అభ్యర్థిపై 4 ఓట్ల తేడాతో గెలుపొందారు.

తూర్పుపల్లిలో అన్నాదమ్ముళ్ల సవాల్

దేవరకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం తూర్పుపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి అన్నదమ్ముళ్లు నామినేషన్లు దాఖలు చేసి ఎన్నికల బరిలో నిలిచారు. తూర్పుపల్లికి చెందిన నాగవరం నిర్మల్‌రావు కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో ఉండగా, ఆయన తమ్ముడు నాగవరం వెంకటేశ్వరరావు బీఆర్ఎస్ నుంచి పోటీలో ఉన్నారు. జనరల్ స్థానమైన తూర్పుపల్లిలో అన్నాదమ్ముళ్లు పోటీపడుతున్నారు.

అడ్లూరు సర్పంచ్ బరిలో బావమరదలు

చింతలపాలెం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం అడ్లూరు గ్రామంలో బావ, మరదలు సర్పంచ్ అభ్యర్థులుగా తలపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థిగా జెట్టి నాగిరెడ్డి బరిలో ఉండగా, బీఆర్ఎస్ మద్దతుతో ఆయన మరదలు జెట్టి కావ్య పోటీ చేస్తున్నారు. గ్రామంలో మొత్తం 530మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్లు మద్దతు కూడబెట్టేందుకు ఇద్దరు అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

గ్రామాన్ని అభివృద్ధి చేసే వారినే గెలిపిస్తాం

నల్లగొండ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారం ముగియడంతో ఓటు వేసేందుకు అంతా సిద్ధమయ్యారు. నిన్నటి వరకు ప్రచారం హోరెత్తించిన అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసేందుకునేందుకు ఎత్తుగడలు వేశారు. గ్రామంలో ఉన్న మహిళలను పలకరిస్తే గ్రామంలో అభివృద్ధి చేసేవారినే ఎన్నుకుంటామని చెప్పారు. గ్రామంలో అభివృద్ధి జరిగితేనే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. ఇన్ని రోజులు ప్రచారం చేసిన అభ్యర్థులు కూడా రైతులు వ్యవసాయ పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చిందే తరువాయి అభ్యర్థులు వెంటనే అక్కడ వాలిపోయి ఓటు అభ్యర్థించారు. గ్రామంలో గట్టి పోటీ ఉండడంతో గ్రామానికి చెందిన ఓటర్లు పట్టణాల్లో ఉండడంతో వారిని ఒప్పించేందుకు అనుచరులను పంపారు. ఓటు వేసేందుకు వచ్చే సౌకర్యాలు కల్పిస్తామని తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేశారు. ఎన్నికలు అత్యంత కీలకంగా మారడంతో అభ్యర్థులు అన్ని ప్రయత్నాలు చేశారు. ఎలాగైనా గెలవాలని ప్రతి ఓటరును కలిశారు. గ్రామాన్ని అభివృద్ధి చేసే హామీతోనే ఓటు వేస్తామని ఓటర్లు సైతం చెప్పుకొచ్చారు.



గ్రామంలో నిర్మానుష్యంగా ఉన్న వీధి



ఇంటి వద్ద కూర్చున్న మహిళలు

పంచాయతీ ఫలితాలపై జోరుగా బెట్టింగులు

భువనగిరి టౌన్, డిసెంబరు 10,(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో గెలుపు పలువురు అభ్యర్థులకు ప్రతిష్టాత్మకంగా మారింది. సర్పంచ్, వార్డు సభ్యులకు పోటీ పడుతున్న ఆశావహులు గెలిస్తే దక్కే రాచ మర్యాదలకంటే ఓడిపోతే ఎదురయ్యే అవమానాన్ని ఊహించుకుంటూ దిగాలు పడుతున్నారు. దీంతో విజయం కోసం పలు రీతుల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. క్రికెట్ మ్యాచ్, ఎన్నికల ఫలితాలపై సర్వసాధారణమైన బెట్టింగ్‌లను కూడా తమ ప్రచారానికి ఆయుధంగా వాడుకుంటూ ఎన్నికల ప్రచారంలో నూతన ఒరవడికి దారి తీయడం గమనార్హం. ఇప్పటివరకు ఎన్నికల ఫలితాలపై కొద్దిమంది బెట్టింగ్ కాస్తూ సొమ్ము చేసుకునేవారు. కానీ గ్రామపంచాయతీ ఎన్నికల్లో బెట్టింగ్‌లలో కొందరు అభ్యర్థులు నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఎన్నికల బరిలో ఉన్న కొద్దిమంది అభ్యర్థులు తమ అనుచరుల ద్వారా తమ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుస్తున్నాడంటూ గ్రామాల్లోని చౌరస్తాలు, చాయ్, కల్లు అడ్డాలు వద్ద బెట్టింగ్‌లు కాయిస్తున్నారు. బెట్టింగ్ కాస్తున్న సొమ్మును కూడా ఆయా అభ్యర్థులే అందిస్తూ కమిషన్లు కూడా ఇస్తున్నారు.

దాత ఇచ్చిన భూమి మినీ స్టేడియానిదే

● ఆ భూమిపై సింగిల్ జడ్జి తీర్పును కొట్టివేసిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

మోత్కూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరులో అన్యాక్రాంతమైన రూ.కోట్ల విలువ చేసే మినీ స్టేడియం భూమి హైకోర్టు తీర్పుతో తిరిగి స్టేడియానికి దక్కింది. 2005లో అప్పటి ఎమ్మెల్యే ఉప్పునూతల పురుషోత్తమరెడ్డి కోరిక మేరకు మోత్కూరులో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి స్థానిక సేక్రెడ్ హార్ట్ హైస్కూల్ అప్పటి ప్రిన్సిపాల్ ఫాదర్ బాలశౌరి తమ పాఠశాల సమీపంలోని సర్వేనంబర్లు 859, 860, 861 మింజుంలేలో ఆరు ఎకరాల భూమిని ఎకరం రూ.50 వేల చొప్పున కొనుగోలు చేశారు. ఆ భూమిని ప్రభుత్వానికి ఇచ్చేదే అయినందున ఫాదర్ బాలశౌరి తన పేరున రిజిస్ట్రేషన్ చేసుకోకుండా తనకు భూమి విక్రయించిన రియల్‌ఎస్టేట్ వ్యాపారులు రవికుమార్, బిక్షమయ్యతో నేరుగా ఆ భూమిని ప్రభుత్వానికి అప్పగిస్తూ 2005 ఫిబ్రవరి 2వ తేదీన మోత్కూరు ఎంఆర్వో వద్ద ఆ భూమిపై వారి హక్కులకు రాజీనామా చేయించారు. 1951 రెవెన్యూ చట్టం రూల్-16 ప్రకారం ఫామ్-సిపై సంతకాలు చేసి రిలిన్‌క్విష్‌మెంటు చేయించారు. దీంతో ఆ భూమి యజమానులు తమ హక్కులు కోల్పోగా, ఆ భూమిపై పూర్తి హక్కులు ప్రభుత్వానికి సంక్రమించాయి. భూ యజమానులైన రవికుమార్, బిక్షమయ్య భూమిని గిఫ్ట్‌గా ఇవ్వలేదు, రిలిన్‌క్విష్ చేశారు. 2005లోనే అప్పటి ఎంఆర్వో జె. దేవపాలన్ ఆ భూమిని అమైండ్‌మెంట్ చేశారు. ఆనాటి నుంచి రెవెన్యూ రికార్డుల్లో అది ప్రభుత్వ భూమిగా వస్తోంది. మోత్కూరుకు కస్తూర్బా పాఠశాల మంజూరు కాగా వేరే చోట ప్రభుత్వ స్థలం లేక ఈ ప్రభుత్వ భూమిలోంచి రెండెకరాలు కేటాయించగా అందులో కస్తూర్బా పాఠశాల నిర్మించారు. మిగతా భూమి నాలుగు ఎకరాలు ఇండోర్ స్టేడియం కోసం ఉంచారు. భూముల ధరలు బాగా పెరగడంతో ఆ భూమిపై రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడింది. స్థానిక రియల్ ఎస్టేట్ వ్యాపారులు 2005లో సదరు భూమిపై రిలిన్‌క్విష్(రాజీనామా)చేసిన యాజమాని రవికుమార్‌తో కుమ్మక్కై అక్కడ ఇండోర్ స్టేడియం నిర్మించనందున తమ భూమి తిరిగి ఇవ్వాలని 2014లో హైకోర్టులో రిట్‌పిటిషన్ వేయించారు. తహసీల్దార్లు మారుతుండటం, స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ భూమి కోర్టు కేసును పట్టించుకోకపోవడంతో హైకోర్టు సింగిల్ బెంచ్ జడ్జి 2024న నవంబరు 21వ తేదీన పిటిషనర్‌కు అనుకూలంగా తీర్పు చెప్పారు. దానిపై అప్పీలుకు వెళ్లడానికి 8 వారాల గడువు ఇచ్చారు. దీంతో మోత్కూరు మునిసిపల్ కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి హైకోర్టులో రిట్‌పిటిషన్(పిల్) (నం.12 ఆఫ్ 2025) వేశారు. దానిపై విచారణ జరిపిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, మరో న్యాయమూర్తి ఈ నెల 8న ఆ భూమి స్టేడియం(ప్రభుత్వాని)కే చెందుతుందని తీర్పు చెప్పారు. గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును కొట్టి వేశారు.

ఆలేరులో షార్ట్‌సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం

ఆలేరు, డిసెంబరు 10,(ఆంధ్రజ్యోతి): షార్ట్‌సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధమైంది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంగి యల్లయ్యకు చెందిన పెంకుటింట్లో మంగళవారం రాత్రి అతని కుమారుడు శివ ఒక్కడే నిద్రించాడు. ఆ సమయంలో ఇంట్లో తల్లిదండ్రులు, పిల్లలు ఎవరూ లేరు. అర్ధరాత్రి దాటిన తర్వాత మూడు గంటల ప్రాంతంలో శివ మేల్కొనగా ఇల్లంతా పొగతో నిండింది. భయపడిన శివ కేకలు వేస్తూ బయటికి వచ్చాడు. దీంతో ఇరుగుపొరుగు వెంటనే అక్కడికి చేరుకొని ఏం జరిగిందని అడిగితే ఇంట్లో పొగలు వస్తున్నాయని చెప్పాడు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అలాగే విద్యుత్ అధికారులకు కూడా సమాచారమిచ్చి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. యాదగిరిగుట్ట ఫైర్‌స్టేషన్ ఫైర్‌మన్ అమిద్ సిబ్బందితో అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో చుట్టుపక్కల ఇళ్లకు ప్రమాదం తప్పింది.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మద్యం పట్టివేత

వలిగొండ, డిసెంబరు 10, (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని గొల్నేపల్లి గ్రామానికి చెందిన బోరుగు యాదగిరి కిరాణం దుకాణం నడుపుతున్నాడు. బుధవారం పోలీసులు స్థానిక తొర్రూర్ క్రాస్ రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా బ్యాగ్‌లో మద్యం బాటిళ్లను తీసుకెళ్తున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. బ్యాగ్‌లో ఆరు బీర్లు, రెండు హాఫ్ బాటిళ్లు, 11క్వార్టర్లు, పది 90ఎంఎల్ బాటిళ్లు ఉన్నట్లు గుర్తించారు. 7.53లీటర్ల మద్యం దాని (విలువ సుమారు రూ.4,968) ఉన్నట్లు అంచనా వేశారు. యాదగిరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేబిస్ లక్షణాలతో వ్యక్తి మృతి

ఆత్మకూర్(ఎస్), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రెండు నెలల క్రితం కుక్క కాటుకు గురైన వ్యక్తి రేబిస్ లక్షణాలతో బుధవారం మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని బొప్పారం గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని బొప్పారం గ్రామానికి చెందిన పరాల సతీష్ (34)కు రెండు నెలల క్రితం కుక్క కరిచింది. అతను చికిత్స కోసం ఆత్మకూర్(ఎస్) పీహెచ్‌సీకి రాగా ఇంజక్షన్ అందుబాటులో లేకపోవడంతో ఇంజక్షన్ తీసుకోలేదు. ఇటీవల సతీష్ అస్వస్థతకు గురయ్యాడు. దీంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లి చికిత్స అందిస్తుండగా రేబిస్ లక్షణాలు బయటపడ్డాయి. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కూమార్తె, కుమారుడు ఉన్నారు.

చికిత్సపొందుతూ..

దామరచర్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలంలోని వాడపల్లి గ్రామానికి చెందిన సోమిరెడ్డి వెంకటరెడ్డి(48) ఈ నెల 7వ తేదీన తన ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం దామరచర్ల వైపు నుంచి వాడపల్లి గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వాడపల్లి గ్రామ శివారులో సోమిరెడ్డి వెంకటరెడ్డి ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనానికి కుక్క అడ్డురావడంతో సడన్ బ్రేక్ వేయగా అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో వెంకటరెడ్డికి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం మిర్యాలగూడకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. వెంకటరెడ్డికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తొలివిడత పంచాయతీ పోరు నేడే

పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తొలి విడత ఎన్నిక నేడు(గురువారం) నిర్వహించనున్నారు. ఈ ఎన్నికలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రాల్లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి సిబ్బందికి సామగ్రి పంపిణీ చేశారు. సామగ్రి పంపిణీని జిల్లా కలెక్టర్లు పరిశీలించి ఏర్పాట్లపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకే పోలింగ్ జరుగనుంది.
(ఆంధ్రజ్యోతి- న్యూస్‌నెట్‌వర్క్)


నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎన్నికల సామగ్రి పంపిణీ పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి


నల్లగొండలోని జూలకంటి ఇంద్రారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూటర్ సెంటర్‌లో సిబ్బంది


సూర్యాపేట జిల్లా మద్దిరాల డిస్ట్రిబ్యూటర్ సెంటర్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్


సూర్యాపేట మండలం బాలెంలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ నరసింహ


నల్లగొండ మండలం అప్పాజిపేటలో పోలీస్ సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లాఎస్పీ శరత్‌చంద్రపవార్




తుర్కపల్లిలో పోలింగ్ సామగ్రి పంపిణీ వివరాలను తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ హనుమంతరావు


నార్కట్‌పల్లిలో సామగ్రి తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్న బస్సులు


నల్లగొండ మండలం రాములబండ పోలింగ్ కేంద్రంలో సామగ్రిని సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది


సూర్యాపేట జిల్లా తిరుమలగిరి నుంచి పోలింగ్ కేంద్రానికి సామగ్రితో వెళుతున్న అధికారులు, సిబ్బంది


రాజాపేట : రఘునాథపూర్‌లో సామాగ్రితో విధులకు వచ్చిన సిబ్బంది


తుర్కపల్లిలో భోజనం వడ్డిస్తున్న కలెక్టర్‌హనుమంతురావు

ఎస్సారెస్పీ రెండో దశ కాల్వకు భీంరెడ్డి పేరు పెట్టాలి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు(ఎస్సారెస్పీ) రెండో దశ కాల్వకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు భీంరెడ్డి నరసింహారెడ్డి(బీఎన్) పేరు పెట్టాలని పలువురు మేధావులు, విద్యావేత్తలు, ప్రముఖ పాత్రికేయులు డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు కోసం సుదీర్ఘకాలం పోరాడి, ఆనాటి ప్రభుత్వాల మీద ఒత్తిడి తెచ్చి మరీ విజయం సాధించిన బీఎన్‌పేరు కాకుండా, దానికి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి(ఆర్‌డీఆర్) పేరు ప్రకటించడం ఎంతమాత్రం సరికాదని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దామోదర్‌రెడ్డి బతికున్నప్పుడు కూడా ఎస్సారెస్పీ రెండో దశ కాల్వకు బీఎన్ పేరుపెట్టాలనే పలు బహిరంగ సభల్లో అభీష్టాన్ని తెలిపిన విషయాన్ని వారంతా గుర్తుచేశారు. 'గోదావరి నీళ్లతో నా గొంతు తడిసిన తర్వాత తుదిశ్వాస విడుస్తానని' ప్రకటించిన పోరాట యోధుడు బీఎన్ అని, ఆయన ఉద్యమ ఫలితంగానే నల్లగొండ జిల్లాకు గోదావరి జలాలు వచ్చాయని కొనియాడారు. బీఎన్ ఆలోచనా వేదిక ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ వేదికగా 'భీమిరెడ్డి, నర్సింహారెడ్డి జ్ఞాపకాలు, ఎస్సారెస్పీ కాల్వపేరు మార్పుపై సమాలోచనలు" అంశంపై సీనియర్ జర్నలిస్టు వర్ధెల్లి మురళి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఎస్సారెస్పీ రెండవ దశ కాల్వకు, సూర్యాపేట జిల్లాకు బీఎన్ పేరుపెట్టాలని సభలో జూలూరు గౌరీశంకర్ తీర్మానాన్ని ప్రతిపాదించారు. దాంతో పాటు సూర్యాపేటలో ఆ మహనీయుడి స్మారకంగా ఆర్థిక, సామాజిక, రాజకీయ, వ్యవసాయ రంగాల పరిశోధనలకు ఆలవాలంగా ఓ విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి అందులో కోరారు. కార్యక్రమానికి హాజరైన ప్రముఖ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి, కె. శ్రీనివాస్, అల్లం నారాయణ, టంకశాల అశోక్, కట్టా శేఖర్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, సినీ దర్శకుడు ఎన్. శంకర్, విశ్రాంత ప్రొఫెసర్లు వినాయక్‌రెడ్డి, భగవంత్‌రెడ్డి తదితరులంతా తీర్మానానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆర్‌డీఆర్ ఎస్సారెస్పీ స్టేజ్-2గా నామకరణం చేస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవోను వెనక్కితీసుకోవాలని వారంతా ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. దీనిపై ఉమ్మడి నల్గొండ జిల్లా మంత్రులు సైతం స్పందించాలని కోరారు. ఇదే విషయమై సీఎం రేవంత్‌కు మెమోరాండం అందజేయాలని సమావేశంలో నిర్ణయించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను ఇష్టానురీతిగా వక్రీకరిస్తూ సినిమాలు తీస్తున్నారని దర్శకుడు ఎన్. శంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. వాస్తవ చరిత్రను భావితరాలకు తెలిపేలా చలనచిత్ర అభివృద్ధి మండలి ద్వారా తెలంగాణ ప్రభుత్వమే సినిమా నిర్మించాలన్నారు. కమ్యూనిస్టు పార్టీలు సైతం బీఎన్ త్యాగనిరతిని విస్మరించడం బాధాకరమని కట్టా శేఖర్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. బీఎన్ పేరును బీఆర్ఎస్ ప్రభుత్వమైనా ఆ ప్రాజెక్టుకు పెట్టుండాల్సింది అని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. చాకలి ఐలమ్మ పోరాటానికి దన్నుగా నిలిచి, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ముఖ్య భూమిక పోషించిన యోధుడు బీఎన్ అని నొక్కి చెప్పారు. ఈ విషయంలో ఇప్పటికైనా సీఎం రేవంత్ పునరాలోచించాలని గోరటి హితవుపలికారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతిని కాపాడుకుందాం. ఈ నేల చిహ్నాలను, వీరులను సముచితంగా గౌరవించుకుందాం అని కె.శ్రీనివాస్, అల్లం నారాయణ పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు రవికాంత్ రెడ్డి, దేగల జనార్ధన్, మారుతి సాగర్, బీఎన్ కుమారుడు ప్రభాకర్‌రెడ్డి, తెలంగాణ రీసోర్స్ సెంటర్ వ్యవస్థాపకుడు ఎం. వేదకుమార్, విజ్ఞాన దర్శిని తాటి రమేష్, న్యాయవాది నల్లగుంట అయోధ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కె. శ్రీనివాస్. చిత్రంలో టంకశాల అశోక్, జూలూరు గౌరీశంకర్, వర్ధెల్లి మురళి, కె. రామచంద్రమూర్తి, కట్టా శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

చౌటుప్పల్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఓటర్లు పల్లె బాట పట్టడంతో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని 65వ నంబరు జాతీయ రహదారిపై బుధవారం వాహనాల రద్దీ నెలకొంది. మొదటి విడత పంచాయతీ ఎన్నికలు గురువారం జరుగుతుండడంతో హైదరాబాద్‌లో నివాసం ఉండే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సొంతూళ్లకు బయలు దేరారు. ప్రధానంగా ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు చెందిన ఓటర్లు పల్లెలకు ప్రయాణమయ్యారు. హైవేపై వాహనాలు నిండి పోవడంతో సర్వీస్ రోడ్ల వెంట పరుగులు తీశాయి. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే మార్గంలో వాహనాలు నిండి పోవడంతో రోడ్డుపై నడవలేని పరిస్థితి ఏర్పడింది. వాహనాలు నెమ్మదిగా ముందుకు కదిలాయి. ఆర్టీసీ బస్‌లు సైతం ప్రయాణికులతో కిటకిటలాడాయి. వాహనాల కోసం ప్రయాణిలు హైవే పై గుంపులు గుంపులుగా కనిపించారు ఏసీపీ మధుసూదన్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐలు మన్మథకుమార్, విజయ్ మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టి వాహనాలు జామ్ కాకుండా చూశారు. జంక్షన్ల వద్ద ట్రాఫిక్‌తో పాటు సివిల్ పోలీసులు సైతం వాహనాలను నియంత్రించారు.


చౌటుప్పల్ పట్టణంలో జాతీయ రహదారిపై బారులు తీరిన వాహనాలు

బాల్యానికి భరోసా ఇవ్వాలి

సూర్యాపేట టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించే సర్పంచ్‌లు, వార్డు సభ్యులు బాల్యానికి భరోసా కల్పించాలని అఖిల భారత బాలల హక్కుల పరిరక్షణ వేదిక జాతీయ అధ్యక్షుడు ఆర్.వెంకట్‌రెడ్డి కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో బాలల హక్కుల కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. మానవ వనరుల అభివృద్ధి గ్రామాభివృద్ధిలో భాగమని స్పష్టం చేశారు. పౌరులందరూ ఆరోగ్యంగా ఉండడం, పౌష్టికాహారం లోపం లేని పిల్లలు, బాల్య వివాహాలు లేకుండా చూడడం, బాల కార్మిక వ్యవస్థ లేకుండా చూడడం, బాలలందరికీ నాణ్యమైన విద్య అందించడం గ్రామాభివృద్ధిలో భాగమన్నారు. కార్యక్రమంలో ఎ.శివరాజు, జంపాల వెంకటేశ్వర్లు, శ్యాంసన్, లలిత, సైదులు, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

● ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్


సర్టిఫికెట్ల ప్రదానోత్సవంలో పాల్గొన్న వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, కళాశాల సిబ్బంది

దేవరకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానానికి ఎదగాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. దేవరకొండ మునగాల కొండల్‌రావు డిగ్రీ కళాశాల 11వ గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా బుధవారం 2024-25 విద్యాసంవత్సరానికి వివిధ సబ్జెక్టుల్లో బంగారు పతకాలకు ఎంపికైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. కళాశాలలో అడ్మిషన్లు పెంచడంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్య అవశ్యకతను వివరించారు. ఎంకేఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి, గోల్డ్‌మెడల్ కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు సముద్రాల ధనంజయ్య, శాంసన్, గాజుల రాజేష్, మల్లికార్జున్, జనార్దన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ కోటయ్య, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'వైద్య విధాన పరిషత్‌ను రద్దు చేయాలి'

తుంగతుర్తి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైద్య విధాన పరిషత్‌ను రద్దు చేసి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసును ఏర్పాటు చేయాలని సూర్యాపేట జిల్లా తుంగతుర్తి ఏరియా ఆస్పత్రి ఆరోగ్య సిబ్బంది కోరారు. ఈ మేరకు ఆర్ఎంవో ఉపేందర్‌కి బుధవారం వినతిప్రతం అందజేసి మాట్లాడారు. ప్రజారోగ్య పరిరక్షణలో కీలక సేవలందిస్తున్న వైద్య విధాన పరిషత్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు లేనందున, నెలనెలా వేతనాలు ఆలస్యం కావడంతో సమస్యలు ఎదుర్కొంటున్నామని తెలిపారు. వైద్య విధాన పరిషత్‌ను రద్దు చేసి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీస్ ఏర్పాటు చేసి జీతాలను ట్రెజరీ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. తమ సమస్యను సంవత్సరం క్రితమే ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినా స్పందించలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది కరుణాకర్, సువర్ణ, నాగమణి, అనిత, నర్సింగ్ అధికారి కవిత తదితరులు పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్: వైద్య ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు డి.నటరాజ్, శ్రీనివాస్ కోరారు. వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం పట్టణంలో నిరసన తెలిపి సూపరింటెండెంట్ ప్రవీణ్‌కు విన పత్రం అందజేశారు. ట్రెజరీల ద్వారా ఉద్యోగులకు ప్రతి నెలా వేతనాలు ఇవ్వాలన్నారు. వైద్యవిధాన పరిషత్‌ను రద్దుచేసి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ ఏర్పాటు చేయాలన్నారు. ఆ కార్యక్రమంలో డాక్టర్ నక్కా రవికుమార్‌గౌడ్, డాక్టర్ గంటా నాగమణి, వెంకటాద్రి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గణేష్



భువనగిరి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు భువనగిరి శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాలకు చెందిన మరికొండ గణేష్ ఎంపికయ్యాడు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం పట్నాలో ఈ నెల 13 నుంచి 17 వరకు జరుగనున్న 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో అండర్ -17 కేటగిరిలో 1500 మీటర్ల పరుగు పందెంలో తెలంగాణ నుంచి పోటీ పడనున్నారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గణేష్‌ను కళాశాల ప్రిన్సిపాల్ మదిర మల్లేశం, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి గోపాల్, అభినందించి మెమొంటో అందజేశారు.

పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ జోక్యం తగదు

(ఆంధ్రజ్యోతి మిర్యాలగూడ)
రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా గ్రామసర్పంచ్ పదవులకు స్వతంత్ర అభ్యర్థులను ఎన్నుకునేలా రాజ్యాంగ నిబంధనలు ఉద్దేశించినప్పటికీ అందుకు పూర్తి భిన్నంగా ప్రస్తుత పంచాయతీ ఎన్నికలు కొనసాగుతున్నాయి. పార్టీల మద్దతుతోనే అభ్యర్థులను నిర్ణయించడం, వారి గెలుపుకోసం అన్ని పార్టీలో హోరాహోరీగా తలపడుతున్నాయి. ఈ ధోరణి సరికాదని గ్రామ అభివృద్ధిలో రాజకీయాలకు అవకాశం కల్పించొద్దని యువతీ, యువకుల మనోగతం. ప్రస్తుతం విద్యావంతులు, ఉన్నత ఉద్యోగాలు చేసేవారు సైతం సర్పంచ్ పదవిపై ఆసక్తి కనబరుస్తుడడం విశేషం. ఇలాంటి సందర్భంలో నీతి, నిజాయితీతో పారదర్శకంగా పాలన కొనసాగించాలని, గ్రామాభివృద్ధి నిధులతో మౌలిక సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలని యువత కోరుతున్నారు.

పార్టీలకతీతంగా నిస్వార్థ వ్యక్తులను ఎన్నుకోవాలి



సర్పంచ్ ఎన్నికల్లో పార్టీలకతీతంగా నిజాయితీ, నిస్వార్థత కలిగిన నాయకుడిని ఎన్నుకోవాలి. మహిళల స్వయం ఉపాధి కోసం ఉచిత కుట్టు, అల్లికల శిక్షణతో పాటు సమభావన సంఘాలకు రుణాలిప్పించి కుటీర పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పించే నాయకులకు ఓటువేసి గెలిపించాలి. పాఠశాలల అభివృద్ధి, వైద్యం, రోడ్డు సౌకర్యాలను మెరుగుపర్చాలి. మురుగునీటి కాల్వలను ఏర్పాటు చేసి పరిశుభ్రతకు ప్రాధాన్యతమిచ్చే విధంగా చర్యలు చేపట్టాలి.
- బి.గణేష్,ప్రైవేటు ఉద్యోగి, బొమ్మకల్

నిజాయితీగా ప్రజల సేవకు అంకితం కావాలి



రాజకీయ నేతల్లో అంకితభావం కొరవడుతోంది. ఎన్నికల్లో గెలుపొందిన ప్రజాప్రతినిధులు ప్రజాసమస్యలపై దృష్టి సారించడంలో విఫలమవుతున్నారు. ప్రజల ఓట్లతో ఎన్నికల్లో గెలిచిన సర్పంచ్‌లు, గ్రా మాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చాలి. విద్యావంతులు రాజకీయాల్లోకి వస్తే గ్రామానికి, సమాజానికి మేలు జరుగుతుంది. గ్రామప్రజలు సుపరిపాలనందించే వారిని గెలిపించాలి. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా విజ్ఞతతో ఓటును వినియోగించుకోవాలి. స్థానికంగా ఉంటూ ప్రజాసమస్యలను తీర్చే నాయకుడిని ఎన్నుకుంటే మంచిది. నేనే సర్పంచ్‌ని అయితే తాగు, సాగునీరు, విద్య, వైద్య సౌకర్యాలను కల్పించి గ్రామసర్వతోఖాభివృద్ధికి పాటుపడతాను.
- కడియం చంద్రరూప (బీ ఫార్మసీ విద్యార్థి, అభంగాపురం)

విద్యావంతులను ఎన్నుకోవాలి

విద్యావంతుడిని సర్పంచ్‌గా ఎన్నుకుంటే గ్రామాభివృద్ధి మెరుగుపడుతుంది. ఆర్థిక సంఘం నుంచి గ్రామాలకు వచ్చే నిధులను గ్రామాల్లో సౌకర్యాల కల్పనకు ఖర్చు చేస్తారు. ఎమ్మెల్యే, ఎంపీలను కూడా రప్పించి గ్రామాల్లోని అంతర్గత రోడ్ల నిర్మాణం, మురుగుకాల్వలు, తాగునీరు, వీధిలైట్లు వంటి సౌకర్యాలను మెరుగుపరిచేందుకు వీలుంటుంది. ప్రజలకు అవసరమయ్యే సౌకర్యాలపై అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి మార్గం సులభం చేస్తారు. ఆర్థిక లాభాపేక్షలేని, ప్రజాసేవకు అంకితమయ్యేవారిని ఎన్నికల్లో గెలిపించుకోవాలి. గ్రామాల్లో వైద్యసౌకర్యాలను మెరుగుపర్చాలి. పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలి. ప్రతి మూడు నెలలకొకసారి గ్రామాల్లో గ్రామసభ నిర్వహించి ప్రజాసమస్యలేమిటో తెలుసుకొని వాటికి పరిష్కార మార్గం చూడాలి.



- నగిరి రీతు, డిగ్రీ విద్యార్థి, త్రిపురారం

చిట్యాలలో ఏర్పాట్లు పూర్తి

● *ఓటు హక్కు వినియోగించుకోనున్న 35,735 మంది*

చిట్యాలరూరల్: చిట్యాల మండలంలో గురువారం స్థానిక సంస్థల ఎన్నికలకు సర్వం సిద్ధం చేశారు. ఎన్నికల ప్రచారం ముగియడంతో గ్రామాల్లోని పోలింగ్‌కేంద్రాల్లో పోలింగ్‌ను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేసినట్లు మండల ఎన్నికల సహాయ అధికారి, ఎంపీడీవో ఎస్‌సీ జయలక్ష్మి తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరగనుంది. 2 గంటల తర్వాత పోలైన ఓట్ల లెక్కింపు చేపడతారు. ఓట్ల లెక్కింపు అనంతరం ఎన్నికల ఫలితాలను అధికారులు విడుదల చేయనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గ్రామపంచాయతీ ఎన్నికల్లో చిట్యాల మండలంలో 35,735 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అందులో పురుషులు 17760, మహిళలు 17975 ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

● చిట్యాలలోని బీఆర్ ఫంక్షన్ హాల్‌లో అధికారులు ఎన్నికల సామగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాన్ని (డీఆర్‌సీ కేంద్రం) ఏర్పాటు చేశారు. కేంద్రంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్, హౌసింగ్ పీడీ ఎస్‌పి.రాజ్‌కుమార్, మండల సహాయ ఎన్నికల అధికారి, ఎంపీడీవో జయలక్ష్మి ఎన్నికల సామగ్రి పంపిణీని పర్యవేక్షించారు. పోలింగ్ పత్రాలు, ఓటర్ల లిస్టులు, బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్కులు, ఓటు వేసేందుకు ఏర్పాటు చేసే కంపార్ట్‌మెంట్‌లతో పాటుగా పోలింగ్ సామగ్రిని అధికారులకు అందించిన సామగ్రిని డీఆర్‌సీ కేంద్రాల్లో సరిచూసుకున్నారు. పోలింగ్ సామగ్రిని తీసుకుని అధికారులు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వాహనాల్లో పోలీసు బందోబస్తుతో బయలుదేరారు. పోలింగ్ అధికారులు వెళ్లే వాహనాలను జేడీఏ శ్రవణ్‌కుమార్, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, ఎంపీడీవో ఎస్‌పి. జయలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. నార్కట్‌పల్లి సీఐ నాగరాజు ఆధ్వర్యంలో చిట్యాల ఎస్‌ఐ రవికుమార్ డీఆర్‌సీ కేంద్రం వద్ద గ్రామాలకు వెళ్లే వాహనాలకు ఎస్కార్ట్‌ను ఏర్పాటు చేసి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలోని గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు అధికారులు, సిబ్బంది, పోలింగ్ సామగ్రి చేరింది.



పోలింగ్ సామగ్రి పంపిణీని పర్యవేక్షిస్తున్న శ్రవణ్‌కుమార్, రాజ్‌కుమార్, ఎంపీడీవో

రిటైర్డు ఉద్యోగులకు ఉచిత కంటి పరీక్షలు

నల్లగొండటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉచిత కంటి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్రా) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నూకల జగదీష్ చంద్ర, పందిర శ్యాంసుందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ భవన్‌లో గురువారం రిటైర్డు ఉద్యోగులకు మ్యాక్స్ విజన్ శ్రీ మహాలక్ష్మి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పంచాయతీ పోరుకు సర్వం సిద్ధం

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు - కేంద్రాలకు చేరుకున్న సామగ్రి, పోలింగ్ సిబ్బంది - పూర్తయిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు



కేతేపల్లి : ఎన్నికల సామగ్రితో బస్సు ఎక్కుతున్న సిబ్బంది



నల్లగొండలో ఎన్నికల సామగ్రిని తీసుకుంటున్న సిబ్బంది

కట్టంగూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరు మండలంలో గురువారం గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో జ్ఞానప్రకాష్‌రావు తెలిపారు. మండలంలోని మొత్తం 22 గ్రామ పంచాయతీలకు మల్లారం, దుగినవెల్లి గ్రామాలు ఏకగ్రీవం కాగా 20గ్రామపంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పూర్తి అయ్యాయి. 201 పోలింగ్ కేంద్రాల్లో 201 మంది స్టేజ్-2 పోలింగ్ అధికారులు, ఓపీవోలు 486మంది, పోలీస్ సిబ్బంది 130 మంది చొప్పున మొత్తం 817 మంది సిబ్బందితో పాటు నలుగురు జోనల్ అధికారులను నియమించారు. 8 రూట్లలో 15 ప్రైవేట్ పాఠశాలల బస్సులను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణలో పాల్గొనే సిబ్బంది స్థానిక ఎంఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌కు చేరుకుని రిపోర్టు చేశారు. మండలంలో 76 మంది సర్పంచులు 460 వార్డు సభ్యులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. బుధవారం సాయంత్రం నుంచే పోలింగ్ కేంద్రాలను పోలీస్ సిబ్బంది తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పలత, జోనల్ అధికారులు నవీన్, అంబటి అంజయ్య, గిరిప్రసాద్, జమీర్, ఎస్‌ఐ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

తిప్పర్తి: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎంపీడీవో సుధాకర్ అన్నారు. గురువారం జరిగే సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో 216 బూత్‌లను ఏర్పాటు చేశారు. 3 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కావడంతో 195 బూత్‌లలో ఎన్నికలు జరగనున్నట్లు ఆయన తెలిపారు. పోలింగ్ సిబ్బంది బుధవారం మధ్యాహ్నం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో పోలీస్ బందోబస్తు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ వి.శంకర్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో ఓటును వినియోగించుకోవాలని సూచించారు.

తిప్పర్తి మండలంలోని పలు విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తమ ఓటును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారు. తిప్పర్తి మండల పరిధిలో 99 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదైనట్లు ఎంపీడీవో సుధాకర్ తెలిపారు.

కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

కేతేపల్లి: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సిబ్బంది పోలింగ్ సామగ్రితో బుధవారం సాయంత్రం గ్రామాలకు చేరుకున్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయితీలు, 147 వార్డు సభ్యుల స్థానాల ఎన్నికల నిర్వహణ కు ఏర్పాటు చేసిన 147 పోలింగ్ కేంద్రాల్లో 31,084 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 15,947 మంది మహిళలు, 15,136 మంది పురుషులు, ఒకరు ట్రాన్స్‌జెండర్ ఓటరు ఉన్నారు. ఇందుకు అవసరమైన బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులు, ఓటింగ్ కాంపౌండ్‌లు ఇతర సామగ్రితో పోలీసు బందోబస్తు మధ్య ఎన్నికల సిబ్బంది బుధవారం సాయంత్రం ఆయా గ్రామాలకు చేరుకున్నారు. మండలంలోని రెండు పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్‌కు అధికారులు ఏర్పాట్లు చేశారు. పోలింగ్ సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఎస్‌ఐ సతీష్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

శాలిగౌరారం: శాలిగౌరారం మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో జ్యోతిలక్ష్మి తెలిపారు. మండలంలోని 24 గ్రామాల్లో 230 పోలింగ్ కేంద్రాల్లో 560 పోలింగ్ సిబ్బందిని, స్టేజీ టూలో 24 మందిని ఇతర పోలీస్ సిబ్బంది 150, మైక్రో అబ్జర్వర్స్, వెబ్‌కాస్టింగ్, 8 రూట్స్, 3 జోన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్డీవో అశోక్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి శేఖర్‌రెడ్డి డిస్ట్రిబ్యూటర్ కేంద్రాలను సందర్శించా రు.

మునుగోడు: మునుగోడు మండలంలో 28 గ్రామాలు 244 వార్డులు ఉన్నాయి. ఇందులో 32వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 212వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. మండలంలో అన్ని గ్రామాల్లో మహిళలు 19047 మంది, పురుషులు 18991 మంది చొప్పున మొత్తం 38038 మంది ఓటర్లు ఉన్నారు. గ్రామాల్లో 244 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎంపీడీవో యుగందర్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం అన్ని గ్రామాల్లో పోలింగ్‌కు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు.

నకిరేకల్: మండలంలో 17 గ్రామాలకు ఒక పంచాయతీ ఏకగ్రీవైంది. దీంతో 16 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు 42 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. 160 వార్డు స్థానాలకు 17 స్థానాలు ఏకగ్రీవం కాగా 143 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మండలవ్యాప్తంగా 26,843 మంది ఓటర్లలో పురుషులు 13,283 మంది, మహిళలు 13558 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ నిర్వహణకు 182 మంది పీఓలు, 270 మంది ఓపీవోలు విధులు నిర్వహిస్తున్నారు.



శాలిగౌరారంలో ఎన్నికల డిస్ట్రిబ్యూటర్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో అశోక్ రెడ్డి



నార్కట్‌పల్లి : సామగ్రితో వెళ్తున్న సిబ్బంది

ఎన్నికలను సమర్థంగా నిర్వహించాలి

మర్రిగూడ: స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని చండూరు ఆర్డీవో శ్రీదేవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని భారత్ ఫంక్షన్‌హాల్‌లో పోలింగ్ బ్యాలెట్ బాక్సులను ఆమె పరిశీలించి అధికారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ మాట్లాడుతూ ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా ఎన్నికల సహాయ అధికారి మున్నయ్య మాట్లాడుతూ మండలంలో 18 గ్రామ పంచాయతీలకు గాను 170 పోటీ కేంద్రాలని ఏర్పాటు చేసినట్లు అందులో 438 మంది పోలింగ్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఎన్నికల బ్యాలెట్ బాక్స్‌లతో పాటు సామగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించినట్లు ఆమె తెలిపారు. మండలంలో మొత్తం 30,685 మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోనున్నట్లు ఆర్డీవో శ్రీదేవి వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్, బిట్టు శ్రీనివాస్, రవికుమార్, ప్రిసైడింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బంగారిగడ్డ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీవో శ్రీదేవి

వారం రోజులుగా పొయ్యి వెలగలే...

● *యరగండ్లపల్లిలో మునుగోడు ఉపఎన్నికలు తలపిస్తున్న వైనం*

మర్రిగూడ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మర్రిగూడెం మండలంలోని యరగండ్లపల్లి గ్రామస్థులు వారం రోజుల నుంచి వారి గృహాల్లో పొయ్యి వెలిగించడం లేదు. అభ్యర్థులు ఏర్పాటు చేసిన మందు, విందు వినోదాలలో మునిగిపోయారు. మునుగోడు నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికను తలపించే విధంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా యరగండ్లపల్లి గ్రామ సర్పంచ్ పదవికి జనరల్ రిజర్వేషన్ కేటాయించారు. దీంతో బీఆర్‌ఎస్ నుంచి బీసీ సామాజికవర్గానికి వల్లంల సంతోష్‌యాదవ్, కాంగ్రెస్ నుంచి పులిమామిడి నర్సిరెడ్డి సర్పంచ్ బరిలోకి దిగారు. ఇరువురు అభ్యర్థులు ఆర్థికస్థోమత కలిగి ఉండటం, సర్పంచ్‌గా పోటీ చేయాలని దృక్పథం ఉండటంతో వారు దసరా పండుగ నాటి నుంచే గ్రామస్థులకు తాయిలాలు ఇస్తూ వస్తున్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలు వచ్చినందున ఇరువురు అభ్యర్థులు ఓటర్లను మచ్చిక చేసుకోవడం కోసం రోజుకు రూ.3 లక్షల చొప్పున ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ఇరువురు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి మద్యం, విందు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఇటువైపు ఉన్న ఓటర్లు అటు వైపు వెళ్లకుండా అటువైపు ఉన్న ఓటర్లు ఇటువైపు వెళ్లకుండా అభ్యర్థులు కట్టడి చేస్తూ అవసరమైతే ఓటుకు రూ.5 నుంచి రూ. 6 వేల వరకు పంపిణీ చేయడానికి సిద్ధమవుతున్నారు. హోరాహోరీగా ఢీ అంటే ఢీ అంటూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. మండల పరిధిలో 18 గ్రామ పంచాయతీల్లో ఎక్కడ కూడా ఏ అభ్యర్థి ఇంత పెద్దమొత్తంలో ఖర్చు చేయడం లేదని పలువురు పేర్కొంటున్నారు. కేవలం ఇరుగండ్లపల్లి గ్రామపంచాయతీలోనే ఇంత పెద్ద ఎత్తున ఎన్నికలకు ఖర్చు చేస్తుండటంతో గ్రామంలో మునుగోడు ఉప ఎన్నికను జ్ఞాపకం చేసుకుంటూ ఓటర్లు ఎన్నికల పండగ చేసుకుంటున్నారు.

ముంపు గ్రామాలకు చివరి ఎన్నికలు

● *ఉనికి కోల్పోనున్న మూడు గ్రామాలు* ● *వలస వెళ్లిన గ్రామస్థులు*

మర్రిగూడ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపడుతున్న చర్లగూడెం రిజర్వాయర్‌లో ముంపునకు గురైన గ్రామాలకు ఈ స్థానిక సంస్థల ఎన్నికలు చివరివి కానున్నాయి. మర్రిగూడ మండలంలోని చర్లగూడెం రిజర్వాయర్‌లో శివన్నగూడ గ్రామపరిధిలోని నర్సిరెడ్డి గూడెం, రాంరెడ్డిపల్లి గ్రామ పరిధిలోని చర్లగూడెం, వెంకిపల్లి గ్రామ పరిధిలోని వెంకేపల్లి తండా, వెంకేపల్లి, మూడు గ్రామాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. ఈ మూడు గ్రామాల్లో సుమారు 1500ఓటర్లు ఉన్నారు. రిజర్వాయర్లు మూడు గ్రామాలు ముంపునకు గురైనందున ఇప్పటికే ఆ గ్రామాల ప్రజలు వలసలు వెళ్లి జీవనం కొనసాగిస్తున్నారు. కేవలం వృద్ధులు మాత్రమే ఇంటి వద్ద ఉంటున్నారు. రిజర్వాయర్ పనులు పూర్తి కావస్తున్నందున అధికారులు ఈ గ్రామాలు ఖాళీ చేయాలని హెచ్చరిస్తున్నారు. ఇంతకాలం ఈ గ్రామాల్ని నమ్ముకొని జీవిస్తున్న ప్రజలకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఏమి చేయలేని స్థితిలో ఉన్నారు. ఈ గ్రామపంచాయతీ ఎన్నికలు ముంప గ్రామాల ప్రజలకు చివరి ఎన్నికలు కానున్నాయి.



ముంపునకు గురవుతున్న వెంకిపల్లి

హక్కుల రక్షణలో పోలీస్ పాత్ర కీలకం

నల్లగొండరూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హక్కులను కాపాడటంలో పోలీస్ పాత్ర కీలకమని రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ సభ్యుడు, డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా గురువారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు హక్కులు, వాటి పరిరక్షణపై నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మానవ హక్కులు అంటే ప్రతి మనిషికి పుట్టుకతోనే లభించే హక్కులు. జీవన హక్కు, విద్యా హక్కు, మాట స్వేచ్ఛ, న్యాయం పొందే హక్కు, వివక్షను నిరాకరించే హక్కు వంటి అనేక హక్కులు ఉంటాయని అన్నారు. ఈ హక్కులు రక్షించబడితేనే మనిషి సంపూర్ణ వ్యక్తిత్వంతో ఎదగగలడని, ఇలాంటి హక్కులను కాపాడేటువంటి వ్యవస్థ పోలీస్ వ్యవస్థ అని పేర్కొన్నారు. సమాజంలో ఎప్పుడైతే పోలీసు వ్యవస్థ నిష్పక్షపాతంగా పనిచేస్తుందో అప్పుడే మానవుల యొక్క అన్ని హక్కులను కాపాడేందుకు దోహదపడతాయని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి విద్యార్థులు తమ యొక్క హక్కుల గురించి తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల గ్రంథాలయశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ సుంకరి రాజారాం, డాక్టర్ యర్రమాద కృష్ణారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ దయానంద్, డాక్టర్ వసంత, చైతన్య సుధ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు

ఎన్నికల ఖర్చులను మంజూరు చేయించాలి



వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

● *పంచాయతీ కార్యదర్శుల వినతి*

చిట్యాలరూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ఎన్నికలు జరుగుతున్నందున వసతులకు అయ్యే ఖర్చులను మంజూరు చేయించాలని మండల పంచాయతీ కార్యదర్శులు కోరారు. చిట్యాలలో బుధవారం ఏర్పాటు చేసిన డీఈసీ కేంద్రంలో మండల ప్రత్యేక అధికారి శ్రవణ్‌కుమార్, హౌజింగ్ పీడీ రాజ్‌కుమార్, చిట్యాల ఎంపీడీవో జయలక్ష్మికి మండలంలోని పంచాయతీ కార్యదర్శులు వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామపంచాయతీలో నిధులు లేనందున అత్యవసరమైన పరిస్థితుల్లో ఖర్చులకు తామే సొంతంగా భరించాల్సి వస్తుందని, తమపై ఆర్థిక పడుతుందని తెలిపారు.

ఎన్నికల నిర్వహణ మొదలు నుంచి టెంటు, కుర్చీలు, లైట్లు, ఫ్యాన్లు, టేబుళ్లు, భోజనాల ఏర్పాటు, సిబ్బందితో పాటు ఇతరత్రా నిర్వహణ వసతులకు చేసే ఖర్చులకు తామే భరించాల్సి వస్తుందని అన్నారు. దీంతో తమపై ఆర్థికభారం పడుతుందని, ఎన్నికల ఖర్చులకు సంబంధించిన నిధుల ను మంజూరు చేయించాలని కోరారు. తమపై భారాన్ని తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మట్టపల్లి కృష్ణయ్య, మేక వెంకటేశ్వరావు, తాటికొండ లింగస్వామి, గోలి మల్లేష్, దేవిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కంచర్ల గౌతమ్, ఇస్లావత్ శారద, దేశగోని మల్లేష్, రావిరాల ఉపేందర్, వలిగొండ పరమేష్, గంజి వైష్ణవి, ఎలుకరాజు మౌనిక, సరిత, అహల్య, శ్రీనివాస్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్ఏ అధ్యక్షుడిగా నూకల వెంకన్న



డివిజన్ ఉద్యోగుల నూతన కమిటీని సన్మానించిన ఉద్యోగులు

నల్లగొండరూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రెవెన్యూ ఉద్యోగ సర్వీసెస్ సంఘం (టీఆర్‌ఎస్‌ఏ) డివిజన్ కమిటీ అధ్యక్షు డిగా నూకల వెంకన్న ఎన్ని కయ్యారు. జిల్లా కేంద్రంలోని రెవెన్యూ గెస్ట్‌హౌజ్ సంఘం కార్యాలయంలో మంగళవారం రాత్రి డివిజన్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. డివిజన్ పరిధిలో 145 ఓటర్లు ఉండగా, 130 వారి ఓటు హక్కును నిర్వహించుకున్నా రు. ఈ ఎన్నికలు టీఆర్‌ఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు కృ ష్ణమూర్తి, నాయకులు అంబాటి ఆంజనేయులు, సందీ ప్, మదర్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కమిటీ డివిజన్ అధ్యక్షుడిగా నూకల వెంకన్న, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎండీ అక్తర్ అలీ, జనరల్ సెక్రటరీ రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ నోముల శంకర్, జా యింట్ సెక్రటరీ అజాంఖాన్, సుస్మిత, ట్రెజరీ, ప్రతాప్‌లు ఎన్నికయ్యా రు. నూతన కమిటీని అనంతరం ప్రమాణస్వీకారం చేశా రు. వారికి కమిటీ సభ్యులు, ఇతరులు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

వాహనాల తనిఖీ

మర్రిగూడ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగం గా ఎన్నికల ఎఫ్‌ఎస్‌టీ బృందం వాహనాల తనిఖీలను ముమ్మరం చేసింది. మండలంలోని రాజుపేటతండా సమీపంలో బుధవారం ఈ బృందం వాహనాలను నిలిపి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బృందం తనిఖీ అధికారి డీటీ నిర్మలదేవి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందులన నిబంధనలు ఉల్లంఘించి డబ్బులు అక్రమంగా తరలిస్తే తనిఖీల్లో భాగంగా పట్టుబడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌నాయక్, రాంబాబు, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

● *ఆర్డీవో శ్రీదేవి*

చండూరురూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): చండూరు మండలంలో జ రగబోయే మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా ఎన్నికలు సజావుగా నిర్వహించాలని ఆర్డీవో శ్రీదేవి అధికారులకు సూచించారు. మండలంలోని అన్ని గ్రామాలకు పోలింగ్ సామగ్రి, ఎన్నికల అధికారులు వారి బృందాలతో చేరుకుని జరగబోయే ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం మండల పరిధిలోని బంగారిగడ్డ పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో శ్రీదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని, ఎలాంటి అవాంతరాలు తలెత్తినా వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని అన్నారు. పోలింగ్ వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో యాదగిరి, ఎంఈవో సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నల్లగొండరూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నల్లగొండ మండలంలో అన్నెపర్తి గ్రామానికి చెందిన పాలకూరి శ్రీధర్ అదే గ్రామానికి చెందిన రెండు పేద కుటుంబాలకు ఆర్థికసాయం అందజేశారు. గ్రామానికి చెందిన మామిడి వెంకన్న, తిరుపాల నర్సింహ ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబసభ్యులు ఆర్థిక ఇబ్బందులు పడుతుండగా విషయం తెలుసుకున్న పాలకూరి శ్రీధర్ తన వంతుగా మామిడి వెంకన్న కుటుంబసభ్యులకు రూ.20 వేలు, తిరుపాల నర్సింహ కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏదుళ్ల శ్రీధర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, నర్సిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, శేఖర్‌రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

నల్లగొండరూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఓం ఓం అయ్యప్ప, ఓంకార రూప అయ్యప్ప, స్వామియే శరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప స్వామి మాలధారుల శరణుఘోషతో శివాజీనగర్ మారుమ్రోగింది. పట్టణంలోని శివాజీనగరల్‌లో గల టీటీడీ కల్యాణ మండపంలో అయ్యప్ప పడిపూజను వైభవంగా నిర్వహించారు. శివాజీయూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్య క్రమానికి నోముల శ్యాం గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జిల్లా అధ్యక్షుడు పున్న కైలాష్ నేత, అల్లి వేణు యాదవ్, గట్టిగొర్ల సత్యనారాయణ యాదవ్, మిర్యాల యాదగిరి, బొడ్డు శంకర్ గురుస్వామి, ఆగు రాజు, గట్టి గొర్ల శివశంకర్ యాదవ్, లింగస్వామి పాల్గొన్నారు.



పడిపూజ నిర్వహిస్తున్న గురుస్వామి

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	576 (271.6250)	20,467	20,467
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.68 (4.38)	456.82	333.24
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.882 (44.0354)	2,000	3,400

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250



పల్లె పోరు.. నేడు తొలి తీర్పు

- నేడే తొలివిడత పోలింగ్
- నల్లగొండ, చండూరు డివిజన్లలో ఏర్పాట్లు పూర్తి
- ఏకగ్రీవాలు మినహా 296 సర్పంచులు, 2,495 వార్డు స్థానాలకు ఎన్నికలు
- గ్రామాలకు చేరిన పోలింగ్ సామాగ్రి

నల్లగొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నల్లగొండ, చండూరు డివిజన్లలోని 14 మండలాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. రెండు డివిజన్లలో 318 పంచాయతీల్లోని సర్పంచ్ స్థానాలకు, 2,870 వార్డు స్థానాలకు 22 సర్పంచ్, 375 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. దీంతో గురువారం జరిగే మొదటివిడత పోలింగ్‌లో 296 సర్పంచ్, 2495 వార్డు మెంబర్ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికల్లో మొత్తం 5,600 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఎన్నికల విధుల నిర్వహణకు 7వేల మంది సిబ్బందిని నియమించారు. గ్రామాలకు చేరిన పోలింగ్ సామాగ్రి మొదటి విడత పంచాయతీ ఎన్నికల కోసం ప్రతీ మండలానికి ఒక డీఆర్‌సీని ఏర్పాటు చేసి ఎన్నికల పోలింగ్ సామాగ్రిని అన్నిగ్రామాలకు పంపిణీ చేశారు. బుధవారమే సామాగ్రితో పాటు సిబ్బంది గ్రామాలకు చేరుకున్నారు. అదేవిధంగా ఒక్కో మండలానికి రూట్ అధికారులతో పాటు ఇద్దరు లేదా ముగ్గురు జోనల్ అధికారులను నియమించారు. ఎప్పటికప్పుడు ఎన్నికల సమాచారం తెలుసుకోవడం కోసం కలెక్టరేట్‌లో కాల్ సెంటర్‌ను ఏర్పాటుచేశారు. ఎన్నికల సంఘం ఆమోదించిన 14 కార్డులలో ఏదో ఒకటి చూపించి ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. పోలింగ్ ముగిసిన వెంటనే కౌంటింగ్ పూర్తి చేయడంతో పాటు ఉపసర్పంచ్ ఎన్నికను కూడా పూర్తి చేయనున్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి పలు మండలాల్లో పర్యటించి ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

నల్లగొండ, చండూరు డివిజన్లలోని పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓటుహక్కు వినియోగించుకోవాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. ఓటర్లు నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 163(బీఎన్ఎస్ఎస్) యాక్టు అమలులో ఉంటుంది. పోలింగ్ కేంద్రాల ప్రాంతంలో 100 మీటర్ల వరకు ఎవరినీ రానివ్వకుండా చూడనున్నారు. ఓటు వేసే వారు సెల్‌ఫోన్లు, ఇంక్ బాటిల్స్‌ను, ఇతర హానికరవస్తువులను తీసుకరాకుండా పోలీసులు తనిఖీ చేయనున్నారు. పోలింగ్ రోజు ఏదైన సంఘటన జరిగితే క్షణాల్లో రూట్ మొబల్ టీం వచ్చేలా ఏర్పాట్లుచేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద నిఘా పెంచారు. ఎన్నికల అనంతరం విజేతలు విజయోత్సవాలకు, ర్యాలీలకు అనుమతి లేదు.





నల్లగొండ మండలం రాములబండలో పోలింగ్ కేంద్రం ఏర్పాటులో సిబ్బంది

మండలం	గ్రామాలు	వార్డులు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు	మొత్తం
చిట్యాల	18	180	17,760	17975	0	35,735
కనగల్లు	31	262	18313	18579	0	36892
కట్టంగూరు	22	206	18,565	18,797	0	37362
కేతేపల్లి	16	160	15136	15947	1	31084
నకిరేకల్	17	160	13283	13558	2	26843
నల్లగొండ	31	270	19166	20063	0	39229
నార్కట్‌పల్లి	29	262	21508	22263	1	43772
శాలిగౌరారం	24	230	19937	20448	3	40388
తిప్పర్తి	26	216	13468	14222	0	27690
చండూరు	19	166	12137	12186	0	24323
గట్టుప్పల్	7	68	7832	7785	0	15617
మర్రిగూడ	18	170	15146	15639	0	30785
మునుగోడు	28	244	18990	19048	0	38038
నాంపల్లి	32	276	17886	18524	1	36411

ఒకరికంటే ఒకరు

- ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు తీవ్రయత్నాలు
- కనిష్టంగా రూ.1000 గరిష్టం రూ.3 వేలు పంపిణీ
- పోటాపోటీగా అధికార, ప్రతిపక్ష, రెబల్స్ అభ్యర్థుల పంపిణీ

నల్లగొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొదటిదశ పోలింగ్ జరిగే గ్రామపంచాయతీల్లో అభ్యర్థులు ఓటర్లను ఆకర్షించేందుకు పోటీపడుతున్నారు. తాయిలాల పంపిణీలో ఒకరిని మించి ఒకరు ముందుంటున్నారు. దీంతో ఓటర్లకు పంచేందుకు నోట్ల కట్టలు కరిగిపోతున్నాయి. అధికార కాంగ్రెస్ అభ్యర్థులతో పాటు, ప్రతిపక్ష బీఆర్ఎస్ మద్దతుదారులు, స్వతంత్రులు, కాంగ్రెస్ రెబల్స్ సైతం పోటాపోటీగా నగదు పంపిణీ చేశారు. ఇప్పటికే ఒక్కో ఇంటికి నాలుగు దఫాలుగా మద్యం పంపిణీ చేయగా, బుధవారం రాత్రి మరోసారి మద్యం సీసాలతో పాటు, నగదు కవర్లు అందజేశారు. కాంగ్రెస్ నేతలు అన్ని పంచాయతీలను గెలవాలనే సంకల్పంతో తమవంతుగా అందించిన ఆర్థిక సహాయంతో పాటు అభ్యర్థులు కొంత కలుపుకొని భారీగా పంపకాలు చేశారు. కాంగ్రెస్ నుంచి బరిలో ఉన్న అభ్యర్థులు ఓటర్లకు ఒక్కో ఓటుకు కనీసం రూ.1000 నుంచి మొదలుపెట్టి గరిష్ఠంగా కొన్ని గ్రామాల్లో రూ.3వేల వరకు నగదు అందజేశారు. అదేవిధంగా చివరిరోజు ఇంటికి కిలో చొప్పున మాంసం, హాఫ్ బాటిల్ విస్కీ అందజేశారు. వీటితో పాటుగా కొన్నిచోట్ల మహిళా సంఘాలు, కులసంఘాల ద్వారా ఒప్పందాలు చేసుకుని ఓటర్లకు నగదు అందజేశారు. నల్లగొండ, మునుగోడు నియోజకవర్గాల్లో ఖర్చు తారస్థాయికి చేరగా, సూర్యాపేట, తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాల్లోనూ గతానికి భిన్నంగా నగదు పంపిణీ జరిగినట్లు సమాచారం. అదేవిధంగా ఆలేరు నియోజకవర్గంలోనూ నగదు, మద్యం పంపిణీ కొనసాగిందని, కొన్నిగ్రామాల్లో అభ్యర్థుల గుణగణాల కంటే తాయిలాలే విజేతను నిర్ణయించే పరిస్థితి నెలకొందని చెబుతున్నారు.

హోం ఓటింగ్ లేనట్టే

- అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగులు, 85 ఏళ్లుపైబడిన వృద్ధులకు హోం ఓటింగ్
- ఈ పంచాయతీ ఎన్నికల్లో అవకాశం లేదు
- ఒంటి గంట వరకే పోలింగ్ సమయం

విచిత్ర అవగాహనలు

వివరాలు 6లో

ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి



సిబ్బంది ర్యాండమైజేషన్ నిర్వహిస్తున్న అధికారులు

నల్లగొండ(కలెక్టరేట్),డిసెంబరు 10,(ఆంధ్రజ్యోతి): మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న దేవరకొండ డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లో విధులు నిర్వహించే సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తయింది. గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకురాలు కొర్రా లక్ష్మీ సమక్షంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ చాంబర్‌లో ర్యాండమైజేషన్ నిర్వహించారు. చందంపేట, చింతపల్లి, దేవరకొండ, గుడిపల్లి, గుండ్లపల్లి, గుర్రంపోడు, కొండమల్లేపల్లి, నేరేడుగొమ్ము, మండలాల్లోని 2206 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. 2647 మంది పీవోలు, 2959 మంది వోపీవోలను విధులకు నియమించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జెడ్పి సీఈవో శ్రీనివాసరావు, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, డీఈవో బిక్షపతి, ఆర్డీవో వై. అశోక్‌రెడ్డి కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్, ఈడీ ఎం. దుర్గారావు, ఎస్ఐసీ అధికారి ప్రేమ్ పాల్గొన్నారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎస్పీ శరత్ చంద్రపవార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్ చంద్రపవార్

నల్లగొండ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు 2వేల మందితో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. నల్లగొండ రూరల్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రం అప్పాజీపేట గ్రామంలో నిర్వహించిన కవాతుతో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మొదటి విడతలో భాగంగా 318గ్రామపంచాయతీల్లో 466 పోలింగ్ కేంద్రాలు, 2870 పోలింగ్ స్టేషన్‌లలో ఎన్నికలు జరగనున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి మండలానికీ సూమరు 2వేల మంది పోలీస్ సిబ్బందితో రూట్ మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించి ఎన్నికలపై ప్రజలకు భరోసా కల్పించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, వాటర్ బాటిళ్లు, ఇంకు బాటిల్లు, పెన్నులు, అగ్నికి సంబంధించిన వస్తువులను అనుమతించబోరని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, నల్లగొండ రూరల్ సీఐ రాఘవరావు, నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదబాబు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

కట్టంగూరు, డిసెంబరు 10, (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలో గురువారం జరగనున్న మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ శరత్ చంద్రపవార్ తెలిపారు. మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో అక్రమాలు జరగకుండా ప్రతి పోలీస్ సమన్వయంతో పనిచేయాలన్నారు.ఆయన వెంట డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ మునుగోటి రవీందర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ పారదర్శకంగా నిర్వహించాలి

నల్లగొండ రూరల్/నార్కట్‌పల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. స్థానిక ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఇంద్రారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ సందర్శించారు. నల్లగొండ మండలంలోని 29 గ్రామాల్లో నిర్వహించే ఎన్నిక సిబ్బందికి నిర్వహణ సామగ్రిని పరిశీలించి, వారి పలు సుచనలు చేశారు. ఈ కేంద్రంలో మండల ఎన్నికల నిర్వహణ అధికారి ఎంపీడీఓ యాకూబ్ నాయక్, తాసీల్దార్ కే.పరుశరాం, ఎంఈవో అరుంధతి ఇతర సిబ్బంది ఉన్నారు. నల్లగొండ మండలంలోని 29 గ్రామాలకు 1114 మంది సిబ్బందితో నిర్వహించనున్నారు. ఇందుకు ప్రొసిడింగ్ అఫీసర్లు 330, ఇతర ప్రొసీడింగ్ ఆఫీసర్లు 530, స్టేజ్ వన్ అఫీసర్లు 34, రూట్ ఆఫీసర్లు, జోనల్ ఆఫీసర్లు 20, పోలీస్ సిబ్బంది 200తో డిఆర్‌సీ కేంద్రనుండి తమ సామగి తీసుకుని ప్రత్యేక బస్సుల్లో వెళ్లారు.

నార్కట్‌పల్లి, డిసెంబరు 10, (ఆంధ్రజ్యోతి) నార్కట్‌పల్లిలోని డీఆర్‌సీ కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా ఎన్నికల పరిశీలకురాలు కొర్ర లక్ష్మీతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో నల్లగొండ ఆర్‌డీవో యానాల అశోక్‌రెడ్డి, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, డీపీవో వెంకయ్య, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో ఉమేశ్‌చారి, ఎంపీవో సుధాకర్ పాల్గొన్నారు.

150 మందితో బందోబస్తు: గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా నార్కట్‌పల్లి మండలంలో 150 మందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్ తెలిపారు. డీఎస్పీ పర్యవేక్షణలో 3 గురు సీఐలు, 9 మంది సీఐలు, మిగతా 145 మంది మెన్, ఉమెన్ పీసీలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.



నల్లగొండలో డీఆర్‌సీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

గట్టుప్పల: ఎలాంటి ఇబ్బందులకు అవకాశం ఇవ్వకుండా మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె గట్టుప్పల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్నికల పంపిణీ స్వీకరణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆమె వెంట జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జెడ్పీసీఈవో శ్రీనివాసరావు, డీఆర్‌డీవో శేఖర్ రెడ్డి, చండూరు ఆర్‌డీవో శ్రీదేవి, ఎంపీడీవో వసంతలక్ష్మి, తహసీల్దార్ రాములు ఉన్నారు.

మునుగోడు : గ్రామపంచాయతీల్లో జరిగే తొలిదశ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మునుగోడులో ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీ ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జడ్పీసీఈవో శ్రీనివాస్‌రావు, డీఆర్డీవో శేఖర్ రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, ఎంపీడీవో యుగంధర్ రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ నరేష్, మండల పరిషత్ పర్యవేక్షకుడు విజయ్‌భాస్కర్, ఎంపీవో మధు ఉన్నారు.

ఊపందుకున్న ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులు

నల్లగొండ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పేద విద్యార్థులు ఉపకార వేతనాలు పొందేందుకుగాను కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. మండలాల వారీగా 13,914 మంది విద్యార్థులకు ఉపకారవేతనాలు అందించాల్సి ఉండగా, వారం వరకు కేవలం6శాతం మాత్రమే ఉన్న వేతనాల దరఖాస్తులు,ఆరు రోజులో 28 శాతానికి పెరిగాయి. ఇందుకు కలెక్టర్ వారంలో రెండుసార్లు ఉపకార వేతనాలపై విద్యాశాఖ అధికారులు, సంక్షేమ అధికారులతో ప్రత్యేక సమీక్షాసమావేశాలు నిర్వహించి దరఖాస్తుల అప్‌లోడ్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఇప్పటివరకు 13,914 మంది విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకున్నారని,తక్కినవారితో దరఖాస్తులను సమర్పించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఒక ప్రకటనలో ఆదేశించారు. ఇందుకు విద్యాశాఖ అధికారులతో పాటు, సంక్షేమ శాఖ అధికారులు, బ్యాంక్ అధికారులు సహకరించాలని, తహసీల్దార్లు విద్యార్థులకు అవసరమైన ధ్రువపత్రాలను జారీ చేయాలన్నారు.

మానవ హక్కులు అందరికీ సమానమే

- జిల్లా జైలు పర్యవేక్షణ అధికారి ప్రమోద్ కుమార్

నల్లగొండ క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులు ప్రతీ ఒక్కరికి సమానంగా వర్తిస్తాయని ఖైదీలు కూడా సమాజంలో భాగమేనని జిల్లా జైలు పర్యవేక్షణాధికారి గౌరు ప్రమోద్ కుమార్ అన్నారు. జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కారాగారంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలకు న్యాయ సహాయం, గౌరవం, రక్షణ, పునరావాసం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు బీమార్జు న్‌రెడ్డి, లెనిన్ బాబు, జైలర్ బాలకృష్ణ, డిప్యూటీ జైలర్ వెంపల్ల వెంకట్ రెడ్డి, చింత వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా జైలు వద్ద పర్యవేక్షణ అధికారి ప్రమోద్‌కుమార్

చట్టాలు పోలీసులకు సైతం వర్తించాలి

సూర్యాపేట టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చట్టాలు సామాన్యులకే కాదని పోలీసులకు సైతం వర్తిస్తాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో జరుగుతున్న లాకప్‌డెత్‌లకు ముగింపు పలకాలన్నారు. లాకప్‌డెత్‌లకు కారణమవుతున్న పోలీసులు, అధికారులు ఏ కులం,వర్గం వారైనా కఠినంగా వ్యవహరించాలన్నారు. కోదాడ మండలానికి చెందిన కర్ల రాజేష్ పోలీసుల చేతుల్లో చిత్రహింసలకు గురై లాకప్‌డెత్‌కు గురయ్యాడన్నారు. నేటికీ అందుకు సంబంధించిన పోలీసులపై ఎలాంటి కేసులు నమోదు చేయడం లేదని, కనీసం చర్యలు తీసుకోలేదన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణమాదిగ

నయీంతో కలిసి దోచుకున్న కిషోర్

డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్

నల్లగొండ, డిసెంబరు 10,(ఆంధ్రజ్యోతి): తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ గ్యాంగ్‌స్టర్ నయీంతో కలిసి హైదరాబాద్‌లో వందల కోట్లు దోచుకున్నారని డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాస్ నేత ఆరోపించారు. జిల్లాకేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కిషోర్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అప్పటి మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డితో కలిసి ఇసుక దోపిడీకి పాల్పడి కోట్లాది రూపాయలు గడించారని, నయీంతో అంటకాగి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. రెండేళ్లలోనే రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డిని, ఉమ్మడి నల్లగొండ జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని విమర్శించే అర్హత కిషోర్‌కు లేదన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ ప్రతీట ఒక్కరిని ఆదుకుంటారని, విద్య, వైద్యం కోసం సహాయ సహకారాలు అందిస్తూనే అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుంటారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రోజుకు 18 గంటలు పనిచేస్తున్నారని, అలాంటి వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీమంత్రి కేటీఆర్‌ల నాయకత్వంలో బీఆర్ఎస్ నేతలు దండుపాళ్యం ముఠాగా ఏర్పడి తెలంగాణను దోచుకున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నల్లగొండ జిల్లాకు ఏ ఒక్క ప్రాజెక్టు కూడా తీసుకురాలేదన్నారు. అలాంటి పార్టీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే ప్రజలు సహించరన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రగతి భవన్‌లో రూ.995కోట్ల ప్రజాధనాన్ని భోజనం ఖర్చులకే ఉపయోగించుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ప్రయోజనం జరగలేదన్నారు. వారి కుటుంబ సభ్యులకు మాత్రమే ఉద్యోగాలు వచ్చాయి తప్ప ప్రజలకు ఎలాంటి ఉపయోగం జరగలేదన్నారు. ఇటీవల నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణకు రూ.5లక్షల75వేల కోట్లు పెట్టుబడులు రానున్నాయని, దీనివల్ల పరిశ్రమలు రావడంతో పాటు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా చైర్మన్ బోడ స్వామి, నాయకులు తాడూరి శ్రీను, శరత్, సచిన్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్

3వ విడత ఎన్నికలకు ప్రచారం ప్రారంభం

దేవరకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లో ఈనెల 17న జరుగనున్న మూడో విడత పంచాయతీ ఎన్నికలకు ప్రచారం బుధవారం ప్రారంభమైంది. డివిజన్ పరిధిలోని 9 మండలాల్లో 269 గ్రామపంచాయతీలకు, 2206 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. డివిజన్‌లో 7 వార్డులకు నామినేషన్లు దాఖలు కాలేదు. డివిజన్‌లో 42 గ్రామపంచాయతీలకు సర్పంచ్ అభ్యర్థులు, 596 వార్డు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో 227 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరుగనున్నాయి. అందుకు డివిజన్ పరిధిలో 721 మంది సర్పంచ్ అభ్యర్థులు, 4,198 మంది వార్డు అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు.

● కొండమల్లేపల్లి : గ్రామపంచాయతీ 3వ దశ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ పూర్తి కావడంతో పాటు పోటీల్లో ఉన్న అభ్యర్థులకు కేటాయింపు పూర్తి కావడంతో అన్ని గ్రామాల్లో ప్రచారం మొదలైంది. కొండమల్లేపల్లి మండలంలో 27 గ్రామపంచాయతీలకు ఏడు గ్రామ పంచాయతీలు ఇప్పటికే ఏకగ్రీవం కాగా మిగిలిన 20 గ్రామపంచాయతీలలో 3వ విడత ఎన్నికలు ఈనెల 17వ తేదీన జరగనున్నాయి. దీంతో మండలంలో ఎన్నికల ప్రచారం జోరందుకుంది.

నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న విజయభాస్కర్, చిత్రంలో నేత్రనిధి ప్రతినిధులు

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలని వాసవీక్లబ్ ఆర్గాన్ డొనేషన్ ఇంటర్నేషనల్ చైర్మన్ మిట్టపల్లి విజయ భాస్కర్ అన్నారు. ఇటీవల మరణించిన రైస్ మిల్లర్ రంగా విశ్వనాథం కంటి పాపలను దానం చేసిన కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించి, అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ఒకరు చేసే నేత్రదానం నలుగురు అంధ రోగులకు చూపునిస్తుందన్నారు. నేత్ర, అవయవ, రక్తదానాలపై స్వచ్ఛంద సంస్థలు, ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ విస్తృత ప్రచారం జరిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఐ డోనర్స్‌తో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డైమండ్ నేత్ర నిధి, అగర్వాల్ ఐ హాస్పిటల్ ప్రతినిధులు మాశెట్టి శ్రీనివాస్, పాంపాటి రామలింగయ్య, సామా శ్రీనివాస్, గుడుగుంట్ల విద్యాసాగర్, శ్రీలక్ష్మి, దేవకి, రామకృష్ణ, రమేష్, పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే : ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

త్రిపురారం డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముడిమాళ్ల బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ సలహాదారుడు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, కాంగ్రెస్ అభ్యర్థులు బిట్టు రవికుమార్, ధనవత్ వెంకటేశ్వర్లు, నజీమ్ పాల్గొన్నారు.

కంకర పోశారు..వదిలేశారు..

● రెండేళ్లుగా నిలిచిన సల్కునూరు రోడ్డు పనులు ● ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు ● త్వరగా పూర్తి చేయాలని వేడుకోలు

(ఆంధ్రజ్యోతి-వేములపల్లి):

దశాబ్దాల కాలంగా నెలకొన్న సమస్యకు పరిష్కారం లభిస్తుందని, తమ గ్రామానికి బస్సు రాకపోకలకు, ప్రయాణానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని అనుకున్న ఆ గ్రామస్థులకు సమస్య పరిష్కారం కాక పోగా కొత్త కష్టాలు తెచ్చిపెట్టింది. కంకర వేసి వదిలిన ఆ రోడ్డుపై కష్టాలే మిగిలాయి. మండలంలోని మంగాపురం గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేక కొన్నేళ్లుగా ఇబ్బందులకు గురవుతూ కనపడ్డ ప్రజాప్రతినిధికల్లా మొరపెట్టుకోగా చివరికి రెండేళ్ల క్రితం బీటీ రోడ్డు మంజూరైంది. గత ప్రభుత్వంలోని గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ సహకారంతో ఎస్టీ ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 1.90కోట్లతో మండలంలోని సల్కునూరు వయా మంగాపురం మీదుగా సీత్యాతండా వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. దీంతో 2023 జూలైలో నాటి ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు రోడ్డు పనులను ప్రారంభించారు. వెంటనే సదరు కాంట్రాక్టర్ రోడ్డు వెంట చెట్లను తొలగించి కల్వర్టు నిర్మాణాలను చేపట్టారు. అనంతరం రోడ్డును చదును చేసి కంకర సైతం పోసి రోలింగ్ చేశారు. అనంతరం నిధులు విడుదలలో జాప్యం జరుగుతుందని సదరు కాంట్రాక్టర్ ఏడాది క్రితం పనులను నిలిపివేయడంతో రోడ్డు పని మళ్లీ మొదటికి వచ్చిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..


అసంపూర్తిగా వదిలేసిన మంగాపురం-సీత్యాతండా రహదారి

ఈ రోడ్డు ద్వారా ఉమ్మడి మండలంలోని తోపుచర్ల, సీత్యాతండా, ఇసుకబావిగూడెం, కుక్కడం గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. మరోవైపు రోడ్డు నిర్మాణం పూర్తికాకపోవడంతో గ్రామానికి బస్సులు రాకపోవడంతో విద్యార్థులు, వృద్ధులు తమ ప్రయాణికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. దీంతో ప్రతిరోజు విద్యార్థులు తమ పాఠశాలకు వెళ్లేందుకు సుమారు 5 కిలో మీటర్ల మేరా నడిచి సల్కునూరు క్రాస్ రోడ్డు వరకు వెళ్లి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది.

రోడ్డు నిర్మాణానికి సంబంధించిన నిధులు తమ శాఖ పరిధిలో కాకపోవడంతో తామేమి చేసే పరిస్థితి లేకుండా పోయిందని ఆర్‌అండ్‌బీ అధికారులు పేర్కొంటున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు చొరవ తీసుకొని రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులు తక్షణమే విడుదల చేసి రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి



రెండేళ్ల రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. రోడ్డు పై కంకర తేలడంతోపాటు భారీ వాహనాలు వచ్చినప్పుడు కంకర దువ్వ లేస్తుండడంతో ప్రమాదాలకు గురవుతున్నాం. రెండేళ్లగా రోడ్డుపై కంకర పరిచి పనులు చేపట్టకుండా కాంట్రాక్టర్ వదిలివేయడంతో బస్సులు, ఆటోలు సైతం గ్రామానికి రాక తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వెంటనే రోడ్డు పనులు పూర్తయ్యే లా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి.

-మద్దిరాల సత్యనారాయణరెడ్డి, మంగాపురం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా

● రాజశేఖర్‌రాజు, డీఎస్పీ, మిర్యాలగూడ



మిర్యాలగూడ డివిజన్‌లోని 382 గ్రామ పంచాయతీలకు రెండోవిడతలో ఎన్నికలు జరుగుతున్నందున పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 14న పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేసేందుకు స్టేషన్‌ల వారీగా ఆయా గ్రామాలపై అవగాహన ఉన్న పోలీసులకు విధులు అప్పగించేలా పట్టణ, గ్రామీణ సీఐలతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు పోలింగ్ భద్రతపై ఆంధ్రజ్యోతితో వివరాలు వెల్లడించారు.

(ఆంధ్రజ్యోతి- మిర్యాలగూడ)

ఆంధ్రజ్యోతి: మిర్యాలగూడ డివిజన్‌లో సమస్యాత్మక ఎన్ని కేంద్రాలను గుర్తించారు?

డీఎస్పీ: డివిజన్‌లో మొత్తం పోలింగ్ లోకేషన్లు 363 కాగా వాటిలో 122 సమస్యాత్మకంగా, 241 కేంద్రాలను సాధారణంగా గుర్తించాం. 2,418 వార్డు పోలింగ్ కేంద్రాలకు 917 సమస్యాత్మకంగా గుర్తించి తగిన రక్షణ చర్యలు చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: డివిజన్‌లో ఎన్ని రూట్‌లుగా విభజించారు?

డీఎస్పీ: మొత్తం 88 రూట్‌లుగా విభజించాం. రూట్ ఆఫీసర్లుగా ఎస్ఐ స్థాయి అధికారి వ్యవహరిస్తారు. రూట్ మొబైల్‌లో ఎస్ఐతో పాటు మరో ఇద్దరు పోలీసులు విధులు నిర్వహిస్తారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ముగ్గురు, సాధారణ కేంద్రాల వద్ద ఇద్దరు పోలీస్ సిబ్బంది, చొప్పున బందోబస్తు నిర్వహించారు..

ఆంధ్రజ్యోతి: పోలింగ్‌కు ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టారు?

డీఎస్పీ: మొత్తం 1,250 మంది పోలీస్ సిబ్బంది పోలింగ్ భద్రతా విధులు నిర్వహిస్తున్నారు. 5 గురు డీఎస్పీలు, 19 మంది సీఐలు, 74 మంది ఎస్ఐ కూడా విధుల్లో పాల్గొంటారు. స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ లో సీఐ, ముగ్గురు సిబ్బంది, డివిజన్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లు డీఎస్పీ 4 గురు సిబ్బంది ఉంటారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించి ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే డివిజన్‌లో సుమారు 222 మంది రౌడీ షీటర్లు స్టేషన్ల వారిగా పిలిచి మాట్లాడం. గన్‌లైసెన్స్ పొందిన 19 మంది వ్యక్తులు ఆయుధాలను డిపాజిట్ చేశారు.

సాయన్న పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి


సాయన్న చిత్రపటానికి పూలమాల వేస్తున్న బీసీ జేఏసీ నాయకులు

మిర్యాలగూడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పండుగ సాయన్న ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. సాయన్న వర్థంతి సందర్భంగా బుధవారం బీసీ బాలుర వసతి గృహంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన కుటుంబంలో పుట్టిన సాయన్న నాడు దేశముఖ్‌లు, భూస్వాములకు అండగా రజాకార్ల అకృత్యాలను అడ్డుకునేందుకు ఓ దళాన్ని ఏర్పాటు చేసుకుని సొంత ఆయుధాలను తయారు చేసుకుని తిరుగుబాటు కొనసాగించాడని అన్నారు. ధనవంతుల, భూస్వాముల ఇళ్లలో దాచుకున్న ధాన్యం బస్తాలు బయటకు తరలించి పేదలకు పంచారని అన్నారు. సంపన్న వర్గాలకు చెందిన వారు ఆయనను బందీపోటుగా చిత్రించేందుకు ప్రయత్నాలు చేసి విఫలమయ్యారని అన్నారు. ప్రభుత్వం సాయన్న విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసి ఆయన జయంతి, వర్థంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం పట్టణ కార్యదర్శి దోనేటి శేఖర్, బంటు సైదులు, బాషం శ్రీనివాస్, రవితేజ, గణేష్, శివ, వంశీ, హరి, శంకర్, ముని, శివతేజ, రవీందర్, వినయ్, విక్రమ్ పాల్గొన్నారు.

● మిర్యాలగూడ టౌన్ : బీసీ భవన్‌లో బీసీ సంఘాల నాయకులు పండుగ సాయన్న చిత్రపటం వద్ద నివాళులర్పించి, ఆయన జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమంలో జేఏసీ కోకన్వీనర్ దాసరాజు జయరాజు, చేదొండి మురళీయాదవ్, కొండా రాంబాబు, పిల్లలమర్రి విజయకుమార్, తిరుపతయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు శంకుస్థాపన దినోత్సవం


శంకుస్థాపన దినోత్సవంలో పాల్గొన్న ఎస్ఈ మల్లికార్జున్‌రావు, ఇతర ఇంజనీర్లు, సిబ్బంది

నాగార్జునసాగర్,డిసెంబరు10(ఆంధ్రజ్యోతి):నాగార్జునసాగర్ ప్రాజెక్టు పునాది రాయి వేసి మంగళవారం నాటికి 70 ఏళ్లు పూర్తయయ్యాయి. 71వ వసంతంలోకి అడుగిడిన అధునిక దేవాలయం శంకుస్థాపన దినోత్సవాన్ని ప్రాజెక్టు ఎస్ఈ మల్లికార్జున్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి ప్రధాని నెహ్రూ వేసిన పైలాన్ పిల్లర్‌కు రంగు రంగుల పూలతో అలంకరించారు. ఇంజనీర్లు, అధికారులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డ్యాం నిర్మాణంలో పాలు పంచుకున్న మొదటి సీఈ మీర్ జాఫర్ అలీ విగ్రహానికి, కార్మికుల స్తూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పైలాన్ పిల్లర్ వద్ద సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎస్ఈ మల్లికార్జున్‌రావు మాట్లాడుతూ అతి పెద్ద మానవ నిర్మిత కట్టడం అయిన సాగర్ ప్రాజెక్టులో పని చేయడం తన పూర్వ జన్మ సుకృతం అన్నారు. ఇంతటి గొప్ప చరిత్ర కలిగిన ప్రాజెక్టును కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. డీఎస్ఈ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ ఈ నీటి సంవత్సరంలో సాగర్ ప్రాజెక్టుకు అతి తక్కువ కాలంలో భారీ వరద రావడంతో తొందరగా నిండిందని దీంతో ఆరు సార్లు ప్రాజెక్టు గేట్లు ఎత్తినట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు కింద ఆయకట్టుకు రెండు పంటలకు సాగు నీరు లక్షలాది గ్రామాలకు తాగునీటిని అందజేస్తామన్నారు. క్రస్ట్ గేట్ల ద్వారా ఈ ఏడాది 1148 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశామన్నారు. సాగర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న ఇంజనీర్లు, అధికారుల సహకారం తోనే సాగర్ డ్యాం పర్యవేక్షణ సాధ్యం అవుతుందన్నారు. కార్యక్రమంల ఇంజనీర్లు, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయండి


మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న లింగంగౌడ్

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ తెలిపారు. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్షేమ భవనాల్లో నివసించే విద్యార్థుల మెస్ బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న కారణంగా విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదన్నారు. హాస్టళ్లలో నివసించే విద్యార్థినులకు కాస్మోటిక్ బిల్లులు సైతం నిలిచిపోయాయన్నారు. అలాగే విద్యార్థులకు సేవలందించే పార్ట్ టైం వర్కర్ల వేతనాలను వెంటనే చెల్లించాలని మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించారన్నారు. ఆయనవెంట బీసీ సంఘాల నాయకులున్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

● మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కైలాష్

దామరచర్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సీనియర్ నాయకులు పడిగపాటి కోటిరెడ్డి కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు పున్నా కైలాష్ నేతతో కలిసి పాల్గొని మాట్లాడారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్నా కైలాష్ నేత మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రతి కష్టపడిన కార్యకర్తలకు అవకాశం కల్పిస్తుందన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ధీరావత్ స్కైలాబ్‌నాయక్, మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు బంటు కిరణ్, చల్లా అంజిరెడ్డి, నాయకులు దారగాని వెంకటేశ్వర్లుగౌడ్, నాగునాయక్, అన్నెం కరుణాకర్‌రెడ్డి, రవితేజ, గాలం వెంకన్నయాదవ్ తపాల్గొన్నారు.

పశువుల ఆస్పత్రిలో గ్రామపంచాయతీ కార్యాలయం

నిడమనూరు మేజరు పంచాయతీకి కార్యాలయం కరువు ● పుష్కరకాలంగా పూర్తికాని భవన నిర్మాణం ● ఇబ్బందులు పడుతున్న సిబ్బంది, పాలకవర్గం, ప్రజలు


పశువుల ఆస్పత్రిలో నిర్వహిస్తున్న పంచాయతీ భవనం

నిడమనూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయానికి సొంత భవనం కరువైంది. ఏళ్ల తరబడిగా స్థానిక పశువుల దవాఖానలో నిర్వహిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పుష్కరకాలంగా భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో పశువుల ఆస్పత్రిలో చిన్న ఇరుకు గదుల్లో నిర్వహించాల్సిన పరిస్థితి దాపురించింది. కనీసం సర్పంచ్, సిబ్బంది, కార్యదర్శి కూడా కూర్చునేందుకు సరైన స్థలం లేదంటే అతిశయోక్తి ఏ మాత్రం కాదు. 14 మంది వార్డు సభ్యులు ఉన్న మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీలో పాలకవర్గం సమావేశం పెట్టుకునే పరిస్థితి కూడా లేదు. నిడమనూరు గ్రామ పంచాయతీకి గతంలో సొంత భవనం ఉండేది. భవనం పాతది కావడంతో పక్కా భవనం నిర్మించేందుకు ప్రభుత్వం 2014లో రూ.16 లక్షల ఈజీఎస్ నిధులు కేటాయించింది. నిర్మాణానికి నిధులు సరిపోలేదని, బిల్లులు రాలేదని నిర్మాణాన్ని మధ్యలోనే వదిలేయడంతో అసంపూర్తిగా పడిఉంది. నిర్మాణం పూర్తి కాకపోవడంతో భవనంలో కంపచెట్లు, పిచ్చి మొక్కలు మొలుస్తున్నాయి. దీంతో గతిలేక పక్కనే ఉన్న పశువుల ఆస్పత్రిలోని స్టోర్ రూముల్లో పంచాయతీ కార్యాలయం విధులు నిర్వహిస్తున్నారు. దీంతో విధుల నిర్వహణలో పంచాయతీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకే ఆవరణలో రెండు కార్యాలయాలు నిర్వహిస్తుండటంతో ఉభయులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్టోర్ రూములు లేక తమకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నందున పంచాయతీ కార్యాలయానికి నిర్వహిస్తున్న గదులను అప్పగించాలని పశువుల ఆస్పత్రి అధికారులు సైతం కోరుతున్నారు.

ఎస్‌డీఎఫ్ నిధుల కేటాయింపు

పంచాయతీ భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో రూ.10 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులను కేటాయించారు. దీంతో పనులు మొదలు పెట్టారు. కానీ నిధులు సరిపోకపోవడంతో ప్రహరీ నిర్మాణం, బోరు, మొరం ఫిల్లింగ్ వంటి పనులు పూర్తి కాలేదు. దీంతో భవన నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. కొత్త పాలకవర్గం త్వరలో వస్తున్నప్పటికీ పక్కా భవనం లేకపోవడం శోచనీయం. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా నిలిచిపోయిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి తక్షణమే అదనపు నిధులు కేటాయించి పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణాన్ని పూర్తి చేసి సొంత భవనాన్ని ప్రజలకు, పాలకవర్గానికి అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి



మండల కేంద్రంలో నిలిచి పోయిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని వెంటనే పూర్తి చేసేందుకు ప్రభుత్వం అదనపు నిధులు కేటాయించాలి. గతంలో కేటాయించిన ఈ జీఎస్ నిధులు సరిపోకపోవడంతో నిర్మాణం మధ్యలో ఆగిపోయింది. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా వెంటనే నిధులు మంజూరు చేసి నిర్మాణం వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది.

- పున్నా శంకర్, నిడమనూరు

అపరిశుభ్రంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణం


పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ప్రవేశ ద్వారం

మిర్యాలగూడ పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ప్రాంగణం అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ప్రైవేటు భవనం మొదటి అంతస్తులో కార్యాలయ సేవలు అందుబాటులో ఉంటాయి. అయితే పై అంతస్తుకువెళ్లే మెట్లపై చెత్తచెదారం నిండుకుంది. అంతేగాక ప్రవేశ ద్వారానికి ఇరువైపులా పాన్, గుట్కా తిని ఊసిన మరకలు దర్శనమిస్తుండగా లావాదేవీలు సాగించేందుకు కార్యాలయానికి వచ్చి పోయే వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇదే కార్యాలయంలో గత నెలలో రెండ్రోజుల పాటు విజిలెన్స్ ఉన్నతాధికారులు దాడులు జరిపినా, కార్యాలయ సిబ్బందికి పరిశుభ్రతపై ధ్యాసే లేకపోవడం గమనార్హం.

(ఆంధ్రజ్యోతి -మిర్యాలగూడ టౌన్)

అందాల హరివిల్లు అనుపు

●గౌతమ బుద్ధుడి చరిత్రకు సజీవ సాక్ష్యం
●కళ్లను కట్టిపడేసే ప్రకృతి సోయగం

నాగార్జునసాగర్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): ఒక వైపు ఎత్తైన కొండలు.. మరో వైపు గలగలపారే కృష్ణమ్మ..ఇంకో వైపు పచ్చదనంతో ఆకట్టుకునే పార్కులు..గౌతమ బుద్ధుడి కాలం నాటి చరిత్రపు కళ్లకు కట్టినట్లు నిర్మాణాలు..ఆచార్య నాగార్జునుడి చరిత్రకు గుర్తుకు తెచ్చే కట్టడాలు...ఇవన్నీ అనుపు సొంతం. ప్రకృతి సోయగాలతో. కృష్ణవేణి నీటి సవ్వడితో పచ్చని పచ్చిక బయళ్ల మధ్య చల్లని గాలులలతో అలరాడుతూ పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తోంది. దేశ విదేశాల నుంచి పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శించడానికి ఏటా వేల సంఖ్యలో వస్తుంటారు. 2006 లో అమరావతిలో జరిగిన కార్యక్రమానికి వెళ్తూ బౌద్ధ మత గురువు దలైలామా అనుపులో ఒక మొక్కను కూడా నాటారు. దీంతో నాటి నుంచి వివిధ దేశాల నుంచి వచ్చే బౌద్ధ పర్యాటకులు నాడు దలైలామా నాటిన మొక్కను సందర్శిస్తుంటారు. అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రంగా విరాజిల్లుతుంది. గౌతమ బుద్ధుడి ఆనవాళ్లకు నెలవైన ఈ ప్రాంతాలన్నే ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆ సమయంలో పలు చోట్ల ప్రాజెక్టు నిర్మాణం కోసం తవ్వకాలు జరిపారు.


అనుపులో పార్కులు

తవ్వకాల్లో గౌతమ బుద్ధుడి కాలం నాటి చరిత్రకు అద్దంపట్టే పలు వస్తువులను, బుద్ధుడి పాలరాతి విగ్రహాలను, ధాతువులు, పలు రకాల లోహపు వస్తువులు బయటపడ్డాయి. వీటిని భద్రపరిచేందుకు నాటి ప్రభుత్వం అనుపు నుంచి 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న(ప్రస్తుతం జలాశయంలో ఉంది)నాగార్జునకొండ, అనుపును ఎంపిక చేశారు. నాగార్జున కొండలో ప్రత్యేకంగా మ్యూజియాన్ని ఏర్పాటు చేసి వస్తువులను భద్రపరిచి ప్రత్యేక భద్రతను ఏర్పాటు చేశారు. నాగార్జునసాగర్‌కు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో పల్నాడు జిల్లా మాచర్ల మండలంలో అనుపు అనే ప్రాంతం ఉంది. రం ఉంటుంది.

కళ్లను కట్టిపడేసే ప్రకృతి సోయగం

అనుపు ఎత్తుగా ఉండే ప్రాంతం నుంచి చూస్తే ప్రకృతి ప్రేమికుల కళ్లకు ప్రకృతి సోయగం కట్టిపడేస్తుంది. ఇక్కడ కళ్లను కట్టిపడేసే ఎన్నో సుందర దృశ్యాలు కనిపిస్తాయి. పురావస్తు శాఖ అభివృద్ధి చేసిన పునర్నిర్మిత కట్టడాలు, దానిచుట్టూ పెంచిన పచ్చదనం, ఎత్తైన కొండలు, దూరంగా కనిపించే కృష్ణా తీరం, అద్భుతంగా ఉంటుంది. వర్షాకాలంలో ఇక్కడ అందాలు పర్యాటకులను మంత్రముగ్ధుల్ని చేస్తాయి. సాగర్‌కు వచ్చే ప్రతి పర్యాటకుడు తప్పనిసరిగా అనుపును సందర్శిస్తుంటారు. ఇక్కడ పునర్నిర్మిత కట్టడాలను నాటి చరిత్రను వివరించేలా తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు.

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

మాడ్గులపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) కాంగ్రెస్ ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని పలు బుధవారం పర్యటించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, దామిడి గోపాలకృష్ణారెడ్డి, మంగా యాదగిరి, ఎరెడ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఉషయ్య, లలిత, నాగిరెడ్డి, షేక్ ఖలీల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

● మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

వేములపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పాలనలోనే పల్లెలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాయని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. బుదవారం మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసగించిందన్నారు. ప్రస్తుత గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, నాయకులు పేరాల కృపాకర్‌రావు, సర్పంచ్ అభ్యర్థులు వల్లంపట్ల లక్ష్మమ్మ, సబ్బు నర్సిరెడ్డి, సందనబోయిన చంద్రయ్య, గడ్డం వీరబాబు, సాయిని మౌనిక, నాయకులు గురువారావు, మాజీ ఎంపీటీసీ శ్రీరాంరెడ్డి, మెరుగు నర్సయ్య, పాపయ్య, రామచంద్రు, సైదులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.